ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ 20
మంగళవారం 29, ఆగస్టు 2017



ప్లాన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన, జేసీ వనజాదేవి

కలెక్టరేట్ భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం

- ప్లాన్‌ను కలెక్టర్ పరిశీలనకు సమర్పించిన అధికారులు
- భవనానికి రూ.35 కోట్లు విడుదల
- త్వరలో పనుల ప్రారంభానికి సన్నాహాలు

వివరాలు : 2లో..



- సాధారణం కన్నా 20 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- సగానికి పైగా మండలాల్లో లోటు వర్షపాతమే
- జిల్లాలో పెరగని భూగర్భ జలాలు
- కంటితుడుపు చినుకులతో రైతుల్లో మొదలైన కలవరం
- భారీ వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు

వ్యవసాయ రంగంపై భారీ ఆశలు పెట్టుకున్న అన్నదాతల్లో కలవరపాటు మొదలైంది. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసిన వాతావరణ శాఖ సంకేతాలు జిల్లా వ్యాప్తంగా తలకిందులైపోతున్నాయి. ఖరీఫ్ సీజన్‌పై గంపెడాశలతో ఉన్న రైతాంగానికి ఈ సారి కూడా ఊరటనిచ్చే వర్షాలు జాడలేక పోవడంతో భూమిపుత్రులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది ఆశించిన వర్షం కురువకపోవడంతో నష్టాలను చవిచూసిన అన్నదాత ఈ సారైనా వరుణుడు కరుణిస్తాడని కోటిఆశలతో ఎదురుచూసినా ఫలితం లేకుండా పోతోంది. చెదురుమదురుగా చిరు జల్లులు మినహా భారీ వర్షాల జాడ లేకుండా పోయింది. ఫలితంగా మెట్ట పంటలకు జీవి గంజి తప్ప చెరువులు, కుంటల్లో జలకళ లేక బోసిపోతున్నాయి. జిల్లాలో సగానికిపైగా మండలాల్లో ఆగస్టులో కురవాల్సిన సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో జిల్లా రైతాంగం ఆందోళనకు గురవుతోంది.

- లింగాలఘణపురం



భూగర్భ జలాలు పెరగకపోవడంతో ఆగిపోస్తున్న బోరుబావి



నీళ్లు లేక ఎండిపోయిన చిల్పూరు మండలం కొండాపూర్ చెరువు

రావమ్మా.. వానమ్మా..



నీళ్లు లేకుండా ఉన్న చిల్పూర్ మండలం మల్కాపూర్ చెరువు

వివరాలు : 2లో..



క్రీడలేత

- నిరాదరణకు గురవుతున్న క్రీడాకారులు
- ఆటస్థలాలు కరువైన ప్రభుత్వ పాఠశాలలు
- పీఈటీలు, పీడీల కొరత
- దాతలు కరుణిస్తేనే క్రీడా పరికరాలు
- చందాలేసుకొని పోటీలకు వెళుతున్న విద్యార్థులు
- వ్యాయామ విద్యపై కొరవడిన శ్రద్ధ

వివరాలు : 20లో..



జనగామ మినీ స్టేడియంలోని మైదానం

మైదానం లేని జనగామ వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల

క్రీడా దినోత్సవంపై పట్టింపేది..? 20



◄ విరిగిన పట్టా

లూప్‌లైన్‌పై విరిగిన రైలు పట్టా 3

- నష్కల్ స్టేజి వద్ద ప్రమాదం
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు
- సరిచేసిన సిబ్బంది

కమిషనర్ క్వార్టర్ అవసరమా? 9

- రూ. 30 లక్షలతో ప్రతిపాదనలు
- ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఆదాయం
- నేడు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావన

రావమ్మా..వానమ్మా..

- సాధారణం కన్నా 20 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- సగానికి పైగా మండలాల్లో లోటు వర్షపాతమే
- కంటితుడుపు చినుకులతో రైతుల్లో మొదలైన కలవరం
- భారీ వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు



వానలు కురువక పోవడంతో నాటుల వేయకుండా వదిలేసిన నారు

లింగాలఘణపురం

చినుకమ్మా.. వాన చినుకమ్మా..
నేల సిన్నబోయె సూడు బతుకమ్మా..
మేఘాల దాగుండి పోకమ్మా..
ఆగమేఘాల మీదను రావమ్మా..
కంటిమీద కునుకు లేదమ్మా
పల్లెకన్నీరు పెడుతోంది చూడమ్మా
కరుణించి ఒకసారి రావమ్మా..
మా కష్టాలెన్నో.. తీరునోయమ్మా
ఎండిపోయే రైతు గుండెను ముద్దాడి
కుండపోతను కురిసిపోవమ్మా..

అంటూ జిల్లా ప్రజలు భారీ వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో పెరగని భూగర్భ జలాలు..

జిల్లాలోని 13 మండలాల్లో గత మూణ్నెళ్లుగా కురుస్తున్న వర్షపాతాన్ని పరిశీలిస్తే ఒక్క జూన్ మాసంలో మినహా జులై, ఆగస్టు మాసాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదైనట్లు ప్రభుత్వ అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా గత వేసవిలో గణనీయంగా పడిపోయిన భూగర్భ జలాలు తిరిగి వర్షాకాలం వచ్చినా కూడా పుంజుకోలేక పోయాయి. దీంతో వ్యవసాయ బోరుబావుల్లో నీటి ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయి మోటార్లు ఆగిపోస్తున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ఖరీఫ్‌పై కోటి ఆశలు పెట్టుకున్న అన్నదాతకు ఈ సారి కూడా చుక్కెదురైందని ఆవేదనకు గురవుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే నాట్లు వేసుకుందామని నారు పోసుకున్న రైతులు చివరికి వానల జాడలేకపోవడంతో పోసుకున్న నారును నాట్లు వేసుకునే పరిస్థితులు కనుచూపు మేరలో కానరాక వదిలేసుకుంటున్నారు.

ఏడు మండలాల్లో లోటు వర్షపాతం..

జిల్లాలోని 13 మండలాల్లో తరిపగొప్పుల, జఫర్‌ఘడ్, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట, బచ్చ న్నపేట, జనగాం, గుండాల ఏడు మండలాల్లో ఆగస్టు మాసంలో కురువాల్సిన సాధారణ వర్షం కంటే లోటు వర్షపాతం నమోదైంది. రఘునాథపల్లి, లింగాలఘణపురం, దేవరుప్పుల మండల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఒక్క చిల్పూరు మండలంలో మాత్రం సాధారణం కంటే 68 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. గత జులై మాసంలో జఫర్‌ఘడ్, బచ్చన్నపేట, జనగాం, లింగాలఘణ పురం, గుండాల మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి తీవ్రమైన లోటు వర్షపాతం నమోదైంది. దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, నర్మెట, తరిగొప్పులమండలాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైంది. నైరుతీ రుతుపవనాల ఆరంభ సీజన్ జూన్ మాసంలో మాత్రం నర్మెట, బచ్చన్నపేట, జనగాం, లింగాలఘణపురం, దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, తరిగొప్పుల మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదై నైరుతీ రుతుపవనాలు ఆరంభంలో అన్నదాతను ఆశలపల్లకిలో ఊరేగించాయి. తర్వాత వరుసగా రెండు నెలలుగా చెదురుమదురు వర్షాలు చిరుజల్లుల రూపంలో నేలను తడిగా మార్చడం తప్ప భారీ వర్షాలు లేకపోయాయి.

ఆగస్టు మాసంలో జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు (మి.మి)

మండలం	నమోదైన వర్షపాతం	సాధారణం
తరిగొప్పుల	128.9	166.2
చిల్పూరు	87.4	269.7
జఫర్‌ఘడ్	122.4	158.5
ఘన్‌పూర్(స్టే)	139.3	269.7
రఘునాథపల్లి	119.7	140.2
నర్మెట	101.7	166.2
బచ్చన్నపేట	100.6	190.0
జనగాం	94.0	130.8
లింగాలఘణపురం	159.9	138.6
గుండాల	90.1	144.5
దేవరుప్పుల	138.7	116.9
పాలకుర్తి	220.6	152.5
కొడకండ్ల	237.3	129.0

సాధారణం కంటే 20 శాతం తక్కువగా కురిసిన వర్షపాతం

జిల్లాలో ఆగస్టు మాసంలో సాధారణ వర్షపాతం 167.1 మి.మి. వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 133.9 మి.మి మాత్రమే కురిసి 20 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అతి తక్కువగా చిల్పూరు మండలంలో మరీ దారుణమైన పరిస్థితి నెలకొంది. అక్కడ 269.7 మిమి వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 87.4 మిమి మాత్రమే కురిసి -68 శాతం లోటు వర్షపాతం రికార్డయింది.



నీళ్లు లేకుండా బోసిపోతున్న లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల చెరువు

కలెక్టరేట్ భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం

- ప్లాన్‌ను కలెక్టర్ పరిశీలనకు సమర్పించిన అధికారులు
- భవనానికి రూ.35 కోట్లు విడుదల
- త్వరలో పనుల ప్రారంభానికి సన్నాహాలు

జనగామ, ఆంధ్రజ్యోతి : జనగామ జిల్లా కలెక్టరేట్ సమీకృత భవన నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయి. 17 ఏళ్లుగా ప్రతిపాదిత స్థలంలో గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలు కూడా స్థలాన్ని ఖాళీ చేశారు. దీంతో రోడ్లు, భవనాల శాఖాధికారులు 25 ఎక రాల స్థలంలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో కూడిన కలెక్టర్ భవన సముదాయం నిర్మాణా నికి సంబంధించి మ్యాప్‌ను, ప్లాన్‌ను, ఎస్టిమేషన్‌ను తయారుచేసి సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీదేవసేనకు సమర్పించారు. జనగామ పట్టణంలోని చౌరస్తా నుంచి సౌర్యాపేట రోడ్డులో కేవలం కిలోమీటర్ దూరంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయ భూముల్లో కలెక్టరేట్ భవనం నిర్మించేందుకు గానూ ప్రభుత్వం దేవదాయ శాఖకు డబ్బు కూడా చెల్లించింది. అక్కడ గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలు 167 మందికి డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిస్తామని హామీ ఇవ్వడంతో గుడిసెలు ఖాళీ చేశారు. దీంతో కలెక్టరేట్ భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. అదే స్థలంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారుల క్వార్టర్స్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి భవన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



కలెక్టరేట్ భవన ప్లాన్

వందశాతం మరుగుదొడ్లు నిర్మించాలి



డీపీవో రవికుమార్

వెల్దండ గ్రామంలోవీదులను పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్

నర్మెట: మండలంలోని వెల్దండ గ్రామంలో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించాలని అందుకు గ్రామ ప్రజలు, యువకులు నడుం బిగించాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ అన్నారు. వెల్దండ గ్రామంలో పారిశుధ్యం, వీధిలైట్లు, చేతిపంపులు, హరితహారం, బీఆర్‌జీఎఫ్ నిధులు, అధికారులు లేకుండానే గ్రామసభలు, వాటర్ ట్యాంక్, సీసీ రోడ్లు ఏమి సక్రమంగా లేవని ఆ గ్రామ యువకులు మే 8న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో పారిశుధ్య లోపం, విషజ్వరంతో రావుల మహేందర్ రెడ్డి అనే హమాలీ కార్మికుడు మృతిచెందాడు. దీంతో స్పందించిన డీపీవో సోమవారం వెల్దండ గ్రామాన్ని ఈఓపీఆర్‌డీ లతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో వున్న వీధులన్నీ తిరిగి పారిశుధ్యం, డ్రెయినేజీ, వీధిదీపాలు, సీసీరోడ్లు, చేతిపంపులను పరిశీలించారు. అదే విధంగా గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలించి నిర్మాణానికి సిద్ధంగా ఉన్న వాటికి ముగ్గులు పోశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. యువకులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు.ఏఎన్ఎం సెంటర్‌ను బీఆర్‌జీఎఫ్ నిధులతో 20 రోజుల్లో పూర్తి చేయాలన్నారు.గ్రామ సభలు నిర్వహించి ఖర్చులు అందరికి తెలియపరచాలన్నారు. సీసీరోడ్లను పూర్తి చేయాలన్నారు. వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకుంటే గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలమ్మ, కార్యదర్శి కనకయ్య పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్

జనగామ టౌన్: జనగామ జిల్లా వ్యాప్తంగా సోమవారం మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం ఎనిమిదివ రోజు కొనసాగింది. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కొనసాగించారు. ఎస్‌పీఆర్ కిడ్స్, కృష్ణవేణి స్కూల్, ఏబీవీ స్కూల్‌తో పాటు ఏడు ప్రాథమిక పాఠశాలలో మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, సామాజిక వైద్య ఆరోగ్య అధికారి మీరాజూర్ రహమాన్, వనజాకుమార్, అనిత, కల్యాణి అనురాధ, ఉజ్వల, శిరిష, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లవకుమార్‌రెడ్డి, లయన్ క్లబ్ జనగామ మిలీనియం క్లబ్ అధ్యక్షుడు కర్రె శ్రీనివాస్, జి.సుగుణాకర్ పాల్గొన్నారు.

ముత్తారంలో టీఆర్‌ఎస్‌లో చేరికలు

పాలకుర్తి : మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో 50 మంది టీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారిలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు బొమ్మగాని యాకమ్మ, కనకలక్ష్మితో పాటు 50 మంది చేరారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ాయకులు భారత శ్రీరాములు, నలమాస రమేష్, అయోధ్య, సోమ్లానాయక్, రాజు, ఉపేందర్ ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మండలంలోని గూడూరుకు చెందిన బెల్లి సర్వయ్య, లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గిలకత్తుల సోమయ్యలకు ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పహాణీ ప్రక్షాళనను సద్వినియోగం చేసుకోవాలి

తరిగొప్పుల: రైతులందరూ పహాణీ ప్రక్షాళన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహ్మద్ సలీం అన్నారు. సోమవారం మండలంలోని సోలీపూర్ గ్రామంలో పహాణీ ప్రక్షాళనకు ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ భూములకు సంబంధించి పహాణీలలో ఏవైనా తప్పులు ఉన్నట్లైతే రైతులు కరెక్షన్ ఫాం నింపి స్థానిక వీఆర్‌ఓకు అందజేయాలన్నారు. ఎంఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్‌వోలు జయాలు, అంజయ్య, రవి, గంగరాజు, గ్రామ సర్పంచ్ ముద్దసాని పద్మజ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



స్టేషన్ ఘన్‌పూర్ చెరువు వద్ద పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ కట్ట వద్ద పైప్‌లైన్, జంగిల్ కటింగ్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య శంకుస్థాపన చేశారు. జీపీ నిధులు 5 లక్షలతో సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కడ బతుకమ్మ ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మలను నీటిలో వదలడానికి అనుకూలంగా రెండు కట్టలను కలుపుతూ పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇ.ప్రతాప్, ఎంపీటీసీలు డాక్టర్ జైహింద్‌రాజు, గోనెల ఉపేందర్, దయాకర్, టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రమేశ్, గట్టు వెంకటస్వామి, అనిత, పి.కుమారస్వామి, కుంభం కుమార్, లింగం, శ్రీధర్, పెసరు సారయ్య, టి.సురేష్, మనోహర్, మాషుక్, జి.వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం

టీమాస్‌తో అగ్రవర్ణాల పాలనకు చెక్ ● ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్

పాలకుర్తి : రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన టీమాస్ సన్నాహక సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 10న చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా టీమాస్ సభను పాలకుర్తిలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 4 శాతం ఉన్న అగ్రవర్ణాల పాలనలో 93 శాతం ఉన్న దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు అన్యాయం జరుగుతోందన్నారు. మూడు సంవత్సరాలలో రూ. 5 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే పేదలకు ఎంత దక్కిందో ఇప్పటి వరకు అర్థం కాలేదన్నారు. సామాజికంగా కేవలం కాంట్రాక్టర్ల కోసమే పథకాలు ప్రవేశపెట్టడం వల్ల సీఎం అంటున్న బంగారు తెలంగాణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో టీఆర్‌ఎస్‌కు టీమాస్ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఉడుత రవి, ఎంబీసీ సంఘం జిల్లా కన్వీనర్ సాంబరాజు యాదగిరి, భూమ రంగయ్య, చిట్యాల రాంచంద్రం, ఏదునూరి వెంకట్రాజం, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవరాయ సాయిలు, చిట్యాల సమ్మయ్య, గుమ్మడిరాజు సాంబయ్య, బానోతు కిషన్, నకిర్త యాకయ్య, ఇటుకాల సోమయ్య, చిదురాల కృష్ణమూర్తి, ఏదునూరి మదార్, ఐలేష్, ఉప్పలయ్య తదితరులున్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ప్రభంజన్ యాదవ్

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, కలెక్టర్

లింగాలఘణపురం: గణేశ్ నవరాత్రోత్సవాల అనంతరం నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, కలెక్టర్ శ్రీదేవసేన శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని సుమారు 300 విగ్రహాలను లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువులో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో వారు ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అపశృతులు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైన మేరకు క్రేన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వారి వెంట డీసీపీ వెంకన్న, జనగామ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఏసీపీలు సంజీవరావు, పద్మనాభరెడ్డి తహసిల్దార్ డాక్టర్ నారాయణ తదితరులు ఉన్నారు.



నెల్లుట్ల చెరువును సందర్శించిన సీపీ సుధీర్‌బాబు, కలెక్టర్ శ్రీదేవసేన

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్‌ను సీపీ సుధీర్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం చేసే ప్రాంతానికి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరించాలని, కట్టకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయం కోసం జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని క్రింది స్థాయి అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం శాంతియుతంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక ఏసీపీ పుల్లా సంజీవరావు ఉన్నారు.



విరిగిన రైలు పట్టా

చిలుపూర్ : చిలుపూర్ మండలం నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుపట్టా విరిగింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో కాజీపేటవైపు గూడ్స్ రైలు వెళుతుండగా జంక్షన్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే లూప్ లైన్ కావడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకపోయినా, భాగ్యనగర్, పుష్‌పుల్, కాకతీయ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. రైల్వే సిబ్బంది అప్రమత్తమై మధ్యాహ్నం వరకు పట్టాలు సరిచేయడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. గూడ్స్ రైలు కావడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతాం

● ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి : నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతామని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు రైతుల జాబితాలు సిద్ధం చేయాలని సూచించారు. పార్టీలకతీతంగా రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎకరానికి రూ. 8 వేలు అందించంలో వీరే బాధ్యత వహించాలని సూచించారు. నగదు నేరుగా రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. అంతే కాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ కూడా అందరికీ వచ్చేలా పని చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, బీటీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ఈ సమావేశంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నల్ల నాగిరెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ మాధవరావు, నాయకులు ముస్కు రాంబాబు, ఎంపీపీ భూక్య ధల్జీత్‌కౌర్, నాయకుడు ఎర్రబెల్లి రాఘవరావు, వైస్‌ఎంపీపీ దామోదర్, పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ పులి ఎలేంద్ర, వీరమనేని యాకాంతరావు, సింగారపు దీపక్, సంపతి శ్రీపాల్‌రెడ్డి, నవీన్ తదితరులున్నారు. అనంతరం మండలంలోని దర్దెపల్లి, వావిలాల గ్రామాల్లో సీసీరోడ్ల పనులను ఎమ్మెల్యే దయాకర్‌రావు ప్రారంభించారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దయాకర్‌రావు

'సీపీఎస్ విధానం రద్దు చేయాలి'

బచ్చన్నపేట: సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు శివగారి కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1న మండలంలో పనిచేస్తున్న అందరు సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి మండల, జిల్లా కేంద్రాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నూకల ఎల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, దేవేందర్, కేదారేశ్వరయ్య, కేశవరావు, ప్రవీణ్‌కుమార్, రాజిరెడ్డి, ప్రశాంత్, నర్సింహులు, యాదయ్య, పరంధాములు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

'వంద శాతం పన్నులు వసూలు చేశాం'



చిలువేరు సంపత్, ఎంపీటీసీ, తరిగొప్పుల-2

ప్ర: తరిగొప్పుల గ్రామ పంచాయతీలో పన్నుల వసూలు ఎంత వరకు పూర్తి చేశారు?

జ: నేను ఎంపీటీసీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గ్రామంలో 100 శాతం పన్నులు వసూలు చేశాం.

ప్ర: గ్రామంలో మరుగు దొడ్ల నిర్మాణం ఎంతవరకొచ్చింది?

జ: ఇప్పటి వరకు 75 శాతం మాత్రమే ఐఎచ్ఎచ్ఎల్ స్కీంలో మరుగు దొడ్లు నిర్మించాం. ఇంకా ఎస్‌బీఎం పథకం కింద మరుగుదొడ్లు మంజూరుకాలేదు. అవి మంజూరైతే 100 శాతం మరుగు దొడ్లు కల్గిన గ్రామంగా తయారు చేస్తా.

ప్ర: ఇంకుడు గుంతల నిర్మాణం ఎంత వరకు పూర్తి చేశారు?

జ: ఈజీఎస్ స్కీంలో గ్రామాల్లో ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత మంజూరైంది. కానీ ఇంత వరకు అవి నిర్మించలేదు. త్వరలో పూర్తిచేస్తాం.

ప్ర: గ్రామంలో పారిశుధ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా?

జ: మిషన్ భగీరథ కాంట్రాక్టర్లు గ్రామంలో పైపులైన్లు తవ్వి సరిగ్గా పూడ్చలేదు. దీంతో రోడ్లపై నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

- తరిగొప్పుల

'ప్రత్యామ్నాయ ఉపాధిపై దృష్టి సారించాలి'



మహిళా సంఘం సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్

బచ్చన్నపేట: మహిళలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు దృష్టి సారించి ఆర్థికవృద్ధిని సాధించాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి, ఉపాధి హామీ భవన్‌లో రచన మండల సంఘం 9వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. 2016-17కు సంబంధించి వార్షిక ఆడిట్ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్త్రీనిధితో పాటు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, ఇతర సభ్యులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. అలాగే గతంలో కట్కూరు గ్రామంలో మల్బరీ తోటలు సాగు చేసిన అనుభవం అక్కడి రైతులకు ఉందని వారికి చేయూత నందించి సెరికల్చర్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో అనిత మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఇటీవల విత్తన బంతుల తయారీ, హరితహారం కార్యక్రమాల్లో తమ సత్తా చాటారన్నారు. ఏపీ ఆనంద్ మాట్లాడుతూ బచ్చన్నపేట మహిళా సమాఖ్య మంచి లాభాల్లో ఉందన్నారు. సమావేశంలో ఏపీఎం నరేందర్, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ ఆశాలత, బేదాటి సిద్దులు, పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులను పరిశీలించిన ఎంపీడీవో

జనగామ రూరల్: మండలంలోని అడవికేశ్వాపూర్ శివారు దోనాబాయి తండాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీవో మహ్మద్ హషీం, ఏపీవో చిక్కుడు భిక్షపతి పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణాలు వాటి ప్రాధాన్యతపై ప్రజలతో మాట్లాడారు. గోపిరాజుపల్లిలో రోడ్డుకు ఇరువైపుల చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రజలు చేపట్టాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి'

నర్మెట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని టీపీటీఎఫ్, డీటీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పెన్షన్ విద్రోహ దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న విద్రోహ దినంగా పాటిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే సామాజిక ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొయ్యడ శ్రీరాములు, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పెద్ది వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపగోని రాములు, అనితకుమార్, శ్యాముల్ ఆనంద్, గడ్డం సంతోష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలి

రఘునాథపల్లి రూరల్: మండలంలోని కంచనపల్లి శివారు గ్రామమైన శివాజీనగర్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అదే విధంగా జనగామ జిల్లా కలెక్టర్ శ్రీ దేవసేనకు వినతి పత్రం అందజేశారు. ప్రత్యేక గ్రామంగా ఏర్పాటు అయితే శివాజీ నగర్ అభివృద్ధి చెందుతుందని వారు వారి వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పి.యాదగిరి, ఎం.బ్రహ్మచారి. కొమురయ్య, బి. విజయ, ఈ. నర్సింగరావు, బి.రాజు, జె. మల్లేష్, నర్సయ్య, ఉన్నారు.

వికలాంగుల హక్కుల కోసం ఉద్యమించాలి



వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రఘునాథపల్లి: వికలాంగుల హక్కుల కోసం ఉద్యమించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జనగామ జిల్లా కన్వీనర్ కుమార్ వికలాంగులకు పిలుపునిచ్చారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం సంఘం మండల అధ్యక్షుడు గడ్డం సందీప్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద క్రిష్ణ నాయకత్వంలో 2006 ఆగస్టు 28న వీహెచ్‌పీఎస్ ఆవిర్భవించిందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్, మడికంటి రేణుక, సింగిరెడ్డి స్వరూప, రామక్రిష్ణ, ఎడ్ల బాలయ్య పాల్గొన్నారు.

లింగాలఘణపురం: లింగాలఘణపురం మండల కేంద్రంలో సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు గడ్డం అంజయ్య జెండావిష్కరణ చేశాడు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు తిప్పారపు బాలయ్య, గడ్డం సోమరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు రవీందర్, ఉపేందర్, శ్రీహరి, ప్రశాంత్, మహేందర్, ముత్తయ్య, అనిల్, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ జిల్లా కన్వీనర్‌గా ప్రశాంత్

జనగామ ఎడ్యుకేషన్: రాష్ట్ర జేఏసీ చైర్మన్ కోదండరాం సూచనల మేరకు జనగామ జిల్లా విద్యార్థి జేఏసీ కో- కన్వీనర్‌గా మజ్జిక ప్రశాంత్‌ను నియమిస్తున్నట్లు జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్ బాల్దె మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా కో- కన్వీనర్ గా నియమించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

జాగృతి విద్యార్థి మండల కన్వీనర్‌గా అనిల్

బచ్చన్నపేట: తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మండల కో-కన్వీనర్‌గా కొప్పు అనిల్‌కుమార్‌ను నియమించినట్లు మండల కన్వీనర్ మల్యాల భాను తెలిపారు. రాష్ట్ర, జిల్లా బాధ్యుల సూచన మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన వారికి అనిల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

డీవైఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: డీవైఎఫ్ఐ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల 5వ మహాసభలో జిల్లా కార్యదర్శి రంగు బాలకృష్ణ సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష కార్యదర్శులుగా గొలనుకొండ నాగరాజు, సెవాన్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ, యువకుల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మహంకాళి రవి, ఆముదాల దినేష్‌రెడ్డి, రంజిత్, సంపత్, అజయ్‌కుమార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల ఘటనకు నిరసనగా బీజేపీ దీక్ష



ఒక్క రోజు దీక్షలో బీజేపీ నాయకులు

జనగామ టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనకు నిరసనగా బీజేపీ దళిత మోర్చ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఒక్కరోజు నిరసన దీక్ష చేశారు. దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు కొలిపాక సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షలో దళిత మోర్చ సీనియర్ నాయకుడు ఉడుగుల రమేష్, మోత్కుపల్లి ఆగయ్య, బీజేపీ నాయకులు మహంకాళి హరిశ్చంద్ర గుప్త పాల్గొని మాట్లాడారు. నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులకు టీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించి మంత్రి కేటీఆర్ రాజీనామాచేయాలన్నారు. దీక్షలలో దళిత మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కుండె రాంచదర్, కౌన్సిలర్ దేవరాయ ఎల్లయ్య, గుర్రం బాబు, నల్లబాబు, గండి శ్రీను, లక్ష్మయ్య, మహేష్, అశోక్, రాజేష్, బేకుపల్లిబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

'కూలీలకు డబ్బు పోస్టాఫీసుల్లోనే చెల్లించాలి'

దేవరుప్పుల: గ్రామాలలో పనిచేసే ఉపాధి కూలీలకు డబ్బులు పోస్టాఫీసుల్లోనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సింగారపు రమేష్ అన్నారు. మండలకేంద్రానికి వచ్చి బ్యాంకులో డబ్బు తీసుకోవాలంటే కూలీలకు అదనపు ఖర్చుతో పాటు ఒక రోజు పనిదినం పోతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు జాటోతు శ్రీను నాయక్, రాములు పాల్గొన్నారు.

రైతులకు డ్రమ్ములు పంపిణీ చేసిన 'లోడి'

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 42 మంది రైతులకు 'లోడి' స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ విజయ్‌పాల్ సేంద్రీయ వ్యవసాయానికి ఉపయోగపడే డ్రమ్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువును తయారు చేసేందుకు, రైతులు జీవామృతం పోయడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, శౌరెడ్డి, వీరబాను, ఎనిమేటర్ యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ ఉద్యోగుల(327) సంఘాన్ని గెలిపించాలి'

జనగామ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 8న జరిగే రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐఎన్‌టీయూసీ (327) సంఘాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ వి.శ్రీధర్ కోరారు. శనివారం జనగామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల సంక్షేమమే 327 యూనియన్ లక్ష్యమన్నారు. గతంలో ఐఎన్‌టీయూసీ చేసిన పోరాటాల ఫలితంగానే 20903 మంది ఉద్యోగాల క్రమబద్ధీకరణ జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ నరేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సాంబయ్య, రాంబాబు, బాలు, వీరాంజనేయులు, నరోత్తంరెడ్డి, బండారు శ్రీనివాస్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మొదటి నుంచి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన మనత 327 సంఘానిదేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అన్నారు. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత అధికారికంగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం ఐలేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, జనగామ డివిజన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, కార్యదర్శి బాలు, సాంబయ్య, శ్రీనివాస్, మహేందర్, విజయ్, బుర్ర యాకయ్య, గొడిషాల ప్రభాకర్, రవి, చందన్, ఆనంద్, వెంకటేష్ పాల్గొన్నారు.

'అక్షరాస్యతను పెంచేందుకు పాటుపడాలి'

జనగామ ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి ఇంటర్మీడియెట్‌లలో చేరేందుకు దివ్యాంగులు వికలాంగ సర్టిఫికెట్ ద్వారా ఫీజులో రాయితీ పొందాలని ఓపెన్ స్కూల్ జిల్లా అబ్జర్వర్ మాధవి అన్నారు. అడ్మిషన్ పొందేవారు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్ల వద్ద దరఖాస్తు పారాలపై సంతకం చేయించి మీ సేవా కేంద్రంలో ఫీజు చెల్లించాలన్నారు. జిల్లా పరీక్షల కామన్ బోర్డు కార్యదర్శి రాందన్ మాట్లాడుతూ అడ్మిషన్లకు సెప్టెంబర్ 14వ తేది చివరి గడువని తెలిపారు. సమావేశంలో ఎంఈవో బద్రుద్దీన్, విష్ణు, శ్రీనివాస్, ప్రకాశం, సంపత్, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక కమిటీల ఎన్నిక

రఘునాథపల్లి రూరల్: మండలంలోని బాంజీపేట అదే విధంగా కంచనపల్లిలో భవన నిర్మాణ రంగ కార్మికుల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రాసమల్ల కొంరయ్య సోమవారం తెలిపారు. బాంజీపేట అధ్యక్షుడిగా చాట్ల రమేష్, కంచనపల్లి అధ్యక్షుడిగా గొంగళ్ల రామచంద్రంలు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. బాంజీపేట కమిటీలో ఊడ్గుల నర్సయ్య, ముప్పిడి ఎల్లయ్య, ఒడకం కొంరయ్య, కొమ్మగళ్ల శంకర్, ఉన్నారు. అలాగే కంచనపల్లి కమిటీలో గొంగళ్ల యాదగిరి, పట్టల ఆంజనేయులు, దుంపలపల్లి రాజు, చాగంటి వెంకన్న ఉన్నారు.

30న మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

లింగాలఘణపురం: మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో వాలీబాల్ క్రీడోత్సవాలకు ఈనెల 30న క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈవో చంద్రారెడ్డి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కైరిక హన్మంతరావు తెలిపారు. ఈ పోటీలు మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాలలో జరగనున్నట్లు వారు తెలిపారు. 1జనవరి 2014 తర్వాత పుట్టి 14 ఏళ్ల లోపు వయసు గల బాలబాలికలు 14 ఏళ్ల లోపు క్రీడల్లో, 1జనవరి 2001 తర్వాత జన్మించిన బాలబాలికలు అండర్ 17 క్రీడలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక క్రీడలో ముగ్గురు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ ముస్తఫాను 9912910551 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్వ్యూ..

'4 మండలాల పరిధిలోనే రిజిస్ట్రేషన్ చేస్తాం'



జి. ప్రసూన, సబ్ రిజిస్ట్రార్, స్టేషన్‌ఘన్‌పూర్

ప్ర: రిజిస్ట్రేషన్ విధానం ఎలా ఉంది?

జ: గతంలో జిల్లాలో ఏ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసునుంచైనా భూముల రిజిస్ట్రేషన్ చేసే వీలుండేది. ఇప్పుడు అలా కాదు. ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిలుపూర్, రఘునాథపల్లి పరిధిలోని భూములకే రిజిస్ట్రేషన్ చేస్తాం.

ప్ర: రిజిస్ట్రేషన్ కోసం ఎవరిని సంప్రదించాలి?

జ: సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నేరుగా సంప్రదించాలి. దళారులను ఆశ్రయించవద్దు. లేకపోతే ఆన్‌లైన్‌లో ఫామ్ నింపి స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

ప్ర: రిజిస్ట్రేషన్ చార్జీల వివరాలు?

జ: సేల్ డీడ్‌కు 5.5 శాతం స్టాంప్ డ్యూటీ, 0.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు, అదనంగా యూజర్ ఛార్జీలు చెల్లించాలి. గిఫ్ట్ సెటిల్‌మెంట్‌కు ఇతరుల వద్ద కొన్న భూమి అయితే 4 శాతం, తాతలు, తండ్రి నుంచి సంక్రమించిన భూమి అయితే 1 శాతం స్టాంప్ డ్యూటీ కట్టాలి. మార్టిగేజ్‌కు 0.5 శాతం, సవరణకు రూ.1150లు చెల్లించాలి. సెటిల్‌మెంట్‌కు 1 నుంచి 2 శాతం, పార్టీషన్‌కు 0.5 నుంచి 1 శాతం, రిలీజ్‌కు 3 శాతం చెల్లించాలి.

ప్ర: డాక్యుమెంట్ తయారీకి రైటర్ల వద్దకు వెళ్లాలా?

జ: అవసరం లేదు. గతంలో రైటర్లకు లైసెన్స్‌లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ వ్యవస్థ లేదు. స్వంతంగా కూడ డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు.

ప్ర: రిజిస్ట్రేషన్‌కు ఏఏ పత్రాలు అవసరం?

జ: ఇళ్లయితే ఓనర్‌షిప్ సర్టిఫికెట్, వ్యవసాయ భూమి అయితే పట్టాదార్ పాసు పుస్తకం, పహాని నకల్, ఈసీలు, లింక్ డాక్యుమెంట్లు తీసుకు వస్తే చాలు.

–స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్

అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు



మండల కేంద్రంలో ఉన్న మహాదేవాలయం



ఆలయం ఎదుట ఉన్న చెత్తా చెదారం

కొడకండ్ల : మండల కేంద్రంలోని మహాదేవాలయ భూములకు రక్షణ కరువైంది. దేవాలయ అభివృద్ధి కోసం, వాటిపై ఆధారపడి జీవించే వారి కోసం కేటాయించిన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఆలయ భూముల్లో పండించిన పంటలతో వచ్చే ఆదాయాన్ని ధూప, దీప, నైవేద్యాల కోసం అలాగే పూజారి జీవన భృతి కోసం ఉపయోగించేవారు. ఈ భూములు ఊరికి మధ్యలో ఉన్న శివాలయం చుట్టూ సర్వే నెంబర్ 80లో 2.32 ఎకరాలు ఉండాలి. ఎలాంటి కంచె లేకపోవడం వల్ల చుట్టు పక్కల గృహాల వాళ్ళు, ఈ స్థలాన్ని ఆనుకొని ఉన్న స్థల యజమానులు కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. పవిత్రంగా చూడాల్సిన ఈ స్థలంలో పిచ్చి చెట్లు పెద్దగా పొదల్లాగా పెరిగాయి. చుట్టు పక్కల నివాసం ఉండే వారు ఈ స్థలాన్ని బహిర్భూమి కోసం ఉపయోగించుకుంటూ రోజు రోజుకు చాలా అధ్వాన్నంగా తయారు చేస్తున్నారు. చెత్త వేయడమే కాకుండా చనిపోయిన జంతు కళేబరాలు కూడా పడేస్తున్నారు. ఈ స్థలానికి పక్కనే ఫంక్షన్ హాలు ఉండడంతో ఫంక్షన్ అయినప్పుడల్లా మిగిలిన చెత్త మొత్తం ఇక్కడే వేస్తున్నారు. గుడి ఎదురుగా ఉన్న ప్రైవేటు పాఠశాలలకు చెందిన పిల్లలు రోజూ మల మూత్ర విసర్జనకు ఉపయోగిస్తుండడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోయింది. దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇదే విషయమై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం కనబడడం లేదు, ప్రభుత్వం మేల్కొని సత్వరమే క్షేత్ర పరిశీలన చేసి ఈ స్థలానికి సరైన సరిహద్దులు నిర్ణయించి తగిన కంచెను ఏర్పాటు చేయాలని భక్తులు, ప్రజలు కోరుకుంటున్నారు.

అపరిశుభ్రమవుతున్న పవిత్ర స్థలం

సుంకరనేని కోటేశ్వర్
బీజేపీ నాయకుడు, కొడకండ్ల



శివాలయానికి సంబంధించిన భూమి అన్యాక్రాంత మవుతోంది. ఆ ప్రాంతమంత చాలా అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సరిహద్దులు నిర్ణయించి కంచె వేయించాలి. కొడకండ్ల తహసీల్దార్‌కు సరిహద్దులు నిర్ణయించాలని దరఖాస్తు ఇచ్చి సంవత్సరమవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై కలెక్టర్‌ను, ఎమ్మెల్యే ఎర్రబెల్లిని త్వరలో కలువబోతున్నాం.

పశువైద్యశాలల్లో మందుల కొరత

స్టేషన్‌ఘన్‌పూర్: పశువైద్యశాలల్లో మందులు లేవని సీఐటీయూ జిల్లా కోశాధికారి వేముల నర్సింగం ఆరోపించారు. సోమవారం డివిజన్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆవులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు రైతులు ప్రభుత్వ పశువైద్యశాలలకు వస్తే అక్కడా సరైన మందులు లేక ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇదే అదనుగా మందుల షాపుల యజమానులు రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యశాలకు మందులు సరఫరా చేయాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు అశోక్, కుమార్, రవి, బాబు, రమేష్, గట్టయ్య, లక్ష్మన్, రాజు, శ్రీనివాస్, శ్రీధర్, ఎల్లయ్య ఉన్నారు.

గౌడ ఐక్యసాధనసమితి యువజన అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్

లింగాలఘణపురం: గౌడ ఐక్యసాధన సమితి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా మండలంలోని సిరిపురంకు చెందిన బస్వగాని వెంకటేశ్ గౌడ్‌ను నియమిస్తూ నియోజకవర్గ అధ్యక్షుడు నర్సయ్య గౌడ్ ఉత్తర్వులను జారీ చేశారు. వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ ఐక్యసాధన బలోపేతానికి నా శాయశక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

'అమరవీరుల త్యాగాలు వృథా కావు'



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న రాపర్తి రాజు

జఫర్‌గఢ్ : బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల ప్రాణ త్యాగాలు వృధా కానివ్వమని సీపీఎం జిల్లా నాయకుడు రాపర్తి రాజు, సీపీఐ జిల్లా నాయకుడు బొమ్మినేని వెంకట్ రెడ్డి అన్నారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ అమర వీరుల 17వ సంస్మరణ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 28 ఆగష్టు 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో తెలుగుదేశం ప్రభుత్వం ముగ్గురు వీరులను పొట్టన పెట్టుకుందన్నారు. టీడీపీ నుంచి వేరుపడిన మరో ముక్క టీఆర్ఎస్ నేడు టీడీపీ ఎజెండానే అమలు చేస్తోందన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు ఆర్.సోమయ్య, ఎండి.జాఫర్, నాయకులు కె.వి జయ్‌కుమార్, కె.సుధాకర్, ఎండి.యాకూబ్ పాషా, ఆర్.సత్యం పాల్గొన్నారు.

1 నుంచి రైతు సమన్వయ కమిటీల ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్: రైతు సమన్వయ కమిటీల ఎన్నిక సెప్టెంబర్ 1 నుంచి 4వరకు నిర్వహించనున్నట్లు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోగుల సారంగపాణి తెలిపారు. సెప్టెంబర్ 1న తాటికొండ, కొత్తపల్లి, మీదికొండ, రాఘవాపూర్, ఛాగల్ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2న సముద్రాల, ఇప్పగూడెం, కోమటిగూడెం, విశ్వనాథపూర్, తానేధార్‌పల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 3న పాంనూర్, నమిలిగొండ, శివునిపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. 4న, 12 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్ రైతు సమన్వయ కమిటీ ఎన్నుకోనున్నట్లు సారంగపాణి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే టి.రాజయ్య ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1నుంచి 4వరకు నిర్వహించే గ్రామ రైతు సమన్వయ సమితిల ఎన్నికకు పార్టీ శ్రేణులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జఫర్‌గడ్‌లో..

జఫర్‌గడ్ : మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నేటి నుంచి రైతు సమన్వయ కమిటీలను ఎంపిక చేయనున్నట్లు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొడారి కనకయ్య, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి జయపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ 29న వెంకటాపూర్, రఘునాథపల్లి, గర్మిళ్ళపల్లి, కోనాయచలం, ఉప్పుగల్లు, 30న కూనూరు, తిడుగు, సాగరం, తిమ్మంపేట, తమ్మడపల్లి(ఐ), 31న తీగారం, సూరారం, షాపల్లి, తమ్మడపల్లి(జి), ఒబులాపూర్, తిమ్మాపూర్, సెప్టెంబర్‌లో జఫర్‌గడ్‌లో కమిటీలు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

చిలుపూర్‌లో..

చిలుపూర్ : రేపటినుంచి మండలంలోని గ్రామాల్లో నిర్వహించే గ్రామ రైతు సమన్వయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలేపల్లి రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు. 30న చిన్నపెండ్యాల, నష్కల్, రాజవరం, వెంకటాద్రిపేట 31న మల్కాపూర్, లింగంపల్లి, శ్రీపతిపల్లి, కొండాపూర్, సెప్టెంబర్ 1న ఫత్తేపూర్, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట, చిలుపూర్ గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

'ఎంబీసీలు ఐక్యతగా ఉండాలి'

జనగామ రూరల్ : వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవాలని గణపతి రజక వృత్తిదారుల సంఘం గ్రామ అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఎంబీసీల సంక్షేమం కోసం ఆగస్టు 31న పట్టణ కేంద్రంలోని జూబ్లీ గార్డెన్‌లో జరుగుతున్న ఎంబీసీ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాములు, భిక్షపతి, యాకయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: రజకుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రజక సంఘం జిల్లా నాయకుడు ఎ.అంజయ్య డిమాండ్ చేశారు.

పట్టణ కమిటీ ఎన్నిక...

అధ్యక్షుడిగా పొన్న వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా మచ్చ భిక్షపతి, కార్యదర్శులుగా రాజేశ్వర్, జయచందర్, కోశాధికారిగి ఎల్లేష్ ఎన్నికయ్యారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం

జఫర్‌గడ్ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కె.భిక్షపతి మాట్లాడుతూ వికలాంగుల పక్షాన నిలబడి ఎమ్మార్పీఎస్ మొదటి నుంచి పని చేస్తోందన్నారు. వికలాంగులకు రాజకీయాల్లో 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, ఎల్లస్వామి, ఆర్.ఆదాం, యాకయ్య, అనిల్, యాకమ్మ, అశోక్, ప్రశాంత్, సమ్మయ్య, నాగరాజు, రాముపాల్గొన్నారు.

చిలూపూర్‌లో..

చిలుపూర్ : వికలాంగ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాచెర్ల శ్రీనివాస్ జెండావిష్కరించారు. వికలాంగుల సంక్షేమం కోసం నిత్యం పరితపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎళ్ళవేళలా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎం. సత్యనారాయణ, చిరంజీవి, నలిమెల నాగరాజు, రమేష్, గోవిందు ప్రవీన్, ప్రణయ్ ఉన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆ శాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పద్మజ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది పనితీరును, పనివేళలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలను, సభ్యత్వాల వివరాలను సేకరించారు. అనంతరం ఎంఎస్ఎఫ్ నాయకులు కార్యదర్శి పద్మజకు పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని వినతి పత్రం అందజేశారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న టీజీడీవో సభ్యులు

తరిగొప్పుల: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని టీజీడీవో కన్వీనర్ జంగ వీరయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తరిగొప్పుల బస్టాండ్ సమీపంలో మరుగుదొడ్లు లేక జనం అవస్థలు పడుతున్నారని అన్నారు. సోమవారం టీజీడీవో ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మణికంఠ, వెంకట్, సురేష్ పాల్గొన్నారు.

'మండలాన్ని వరంగల్ అర్బన్‌లో కలిపే వరకు ఉద్యమం'

జఫర్‌గడ్ : జఫర్‌గడ్ మండలం వరంగల్ అర్బన్ జిల్లాలో కలిసినప్పుడే మాడరాజు రాజుకు అసలైన నివాళి అర్పించినట్లని మండల రాజకీయ జేఏసీ కన్వీనర్ బానోతు రాజేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జేఏసీ నాయకుడు మాడరాజు రాజు అనారోగ్యంతో పది రోజుల కిందట మృతి చెందాడు. సోమవారం ఆయన దశదిన ఖర్మలు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలోని జేఏసీ దీక్షా శిబిరం దగ్గర రాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి మౌనం పాటిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ కన్వీనర్ రాజేష్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా జఫర్‌గడ్ మండలాన్ని జనగామ జిల్లాలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమంలో రాజు ముందున్నాడన్నారు. మండలాన్ని వరంగల్ అర్బన్ జిల్లాలో కలిపే వరకు ఉద్యమాలు ఆపమని సాగిన 150 రోజుల ఉద్యమంలో జైలుకు వెళ్ళిన నాయకుడు రాజు అన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ ఎ.బిక్షపతి, రేగడితండా సర్పంచ్ బి.లచ్చిరాం నాయక్, నాయకులు కె.మోహన్‌రావు, ఆర్.రాజు, టి.కుమార్, ఎస్.వెంకట్రాంనర్సయ్య, కె.నర్సింగం, బి.వెంకట్‌రెడ్డి, ఆర్.సోమయ్య, ఎండి.ముజీబ్, బి.పవన్, ఆర్.యాకయ్య, సిహెచ్.కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, బి.నాగరాజు, టి.రాజెందర్, ఎం.యాదగిరి, సారంగం, ఎల్లగౌడ్, కిషన్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

నంద్యాలలో టీడీపీ విజయంపై హర్షం

జనగామ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించడం పట్ల జనగామ జిల్లా టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొండం మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, పట్టణ కన్వీనర్ పోకల లింగయ్య, మండల కన్వీనర్ వజ్జా పరుశరాములు, నాయకులు చీకట్ల నవీన్, చెంద్రయ్య, స్టాలిన్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంపై ఆ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ మండల శాఖతో పాటు వివిధ గ్రామ శాఖలు హర్షం ప్రకటించాయి. సోమవారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు చింత భరత్, రాష్ట్ర నాయకులు గట్టు ప్రసాద్‌బాబు, జిల్లా నాయకుడు బి.ప్రభాకర్ మండలంలోని తాటికొండలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారపాక నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు మ్యాకల ఉప్పలయ్య, మైనారిటీ సెల్ నాయకుడు ఎమ్డీ.అరాఫత్, తాటికొండ సంపత్, నారబోయిన పెరుమాండ్లు, పండుగ శ్రీకాంత్ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపు పట్ల హర్షం ప్రకటించారు.

సీపీఎం నాయకురాలు సుగుణమ్మ మృతి

జనగామ టౌన్: జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు ఎషబోయిన సుగుణమ్మ(52) అనారోగ్యంతో మృతిచెందారు. సీపీఎం మండల కమిటీ నాయకులు ఆమె మృతదేహంపై ఎరుపు రంగ వస్త్రం కప్పి నివాళులర్పించారు. మండల కార్యదర్శి పోత్కనూరి ఉపేందర్, అంబటి సత్యనారాయణ, మీట్యానాయక్, సికిందర్, సుదర్శన్, సూరి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి'

తరిగొప్పుల: లబ్ధిదారులందరికీ ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి మండలంలో 42 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. కానీ, అధికారులు ఇప్పటి వరకు రుణాలు అందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికెనా ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దామెర జేరాజు, దాసు, జోసెఫ్, బండ రాజు, బాలయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 9


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సమావేశాలు, వేడుకల్లో ఆశాభంగం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదరయ్యే అవకాశం ఉంది. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలించకపోవచ్చు.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీల్లో గత అనుభవం ఉపయోగపడుతుంది.


మిథునరాశి: (మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వేడుకలకు ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బంధుమిత్రుల కారణంగా మనస్తాపానికి గురవుతారు. అనుబంధాలు విస్తరిస్తాయి.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఇంటర్వ్యూలలో నిరాశ ఎదురవుతుంది. వైద్యం, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. విందుల్లో ఖర్చులు అధికం.


సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులకు అవసరమైన నిధులు అందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగా వారు కీలక నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల వైఖరి గురించి ఆలోచిస్తారు.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. స్టేషనరీ, రవాణా, బోధన, రచనా రంగాల వారికి ఆటంకాలు ఎదురవుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక సంస్థలతో పనులు పూర్తి కావడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఖర్చులు అంచనాలు మించే అవకాశం ఉంది. బృందకార్యక్రమాలకు అవసరమైన నిధులు సర్దుబాటు కావడంలో ఆలస్యం జరుగుతుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి తగిన సమయం కాదు. వృత్తి, వ్యాపారాల్లో ప్రయోగాలను వాయిదా వేయండి. పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ఊహించని అవాంతరాలు ఎదురవుతాయి. ప్రయాణాలు, చర్చలు ఫలించకపోవచ్చు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించిన సమాచారం కలవరపెడుతుంది.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సమావేశాలు, వేడుకలు, బృందకార్యక్రమాల కోసం ఖర్చులు అధికం. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. పూర్వ మిత్రులను గుర్తు చేసుకుంటారు. విలువైన వస్తువుల కొనుగోలు సమయంలో జాగ్రత్త అవసరం.


మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవుల విషయంలో నిరాశకు గురవుతాయి. పెద్దలు, పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సమావేశాల్లో ఈ గౌరవ, మర్యాదలకు భంగం కలిగే పరిణామాలు చోటుచేసుకుంటాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

అంగన్‌వాడీలో వేడి పాలల్లో పడిన బాలుడు

45 శాతం కాలిన శరీరం
ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డులో చికిత్స
అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
బాధ్యులైన టీచర్, ఆయాల తొలగింపునకు ఉత్తర్వులు
చికిత్సకు అయ్యే ఖర్చు భరిస్తాం : మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయి

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా): అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంతో అభంశుభం తెలియని మూడేళ్ల బాలుడు వేడి పాల గిన్నెలో పడి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో జరిగింది.

మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ రెండో సెంటర్(ఎస్సీ కాలనీ సెంటర్)లో ఏడుగురు మూడేళ్లలోపు పిల్లలు హాజరయ్యారు. ఈక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ గదిలో మండల కేంద్రానికి చెందిన సోమారపు ప్రణిత్‌తేజతో పాటు మరొకరు సరదాగా నెట్టుకుంటూ గదిలో ఉన్న పాలగిన్నెలో పడడంతో ప్రణిత్‌తేజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అంగన్‌వాడీ టీచర్ సోమరపు విజయ్, ఆయా లక్ష్మి వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈక్రమంలో అక్కడి వైద్యులు సీతారాంరాజు, అక్షయ్ బాలుడికి ప్రథమ చికిత్స చేసి వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. బాలుడికి 45 శాతం పాలతో శరీరం కాలిపోయిందన్నారు.



బాలుడికి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు



అంగన్‌వాడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శిశు సంక్షేమ అధికారి లెనినా

పరిశీలించిన జిల్లా శిశు సంక్షేమ అధికారి

అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాల గిన్నెలో బాలుడు పడ్డాడనే సమాచారంతో జిల్లా శిశు సంక్షేమ అధికారి లేనినా, సీడీపీవో శిరీష, చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన విషయంపై జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా, శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయిలకు ఫోన్లో సమాచారం అందించారు. దీంతో విజయేంద్రబోయి, కలెక్టర్ ప్రీతిమీనా ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సెంటర్ టీచర్ విజయతో పాటు, ఆయా లక్ష్మిలను విధుల నుంచి తొలగిస్తున్నట్టు విలేకరులకు తెలిపారు.

అనంతరం బాలుడి ఆరోగ్యంపై కలెక్టర్ ప్రీతిమీనా ఐసీడీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ విజయేంద్రబోయి ఖర్చును తామే భరిస్తామని చెప్పారు. నాణ్యమైన వైద్యం అందించేందుకు అధికారులు, తల్లిదండ్రులు చర్యలు తీసుకుంటున్నారు.

కాగా, సంబంధిత సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లోపంతోనే ఈ సంఘటన జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గున్నేపల్లిలో అంగన్‌వాడీ టీచర్ తొలగింపు

దంతాలపల్లి: మండలంలోని గున్నేపల్లి గ్రామంలోని రెండో అంగన్‌వాడీ టీచర్ మద్దుల రజితను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం జిల్లా శిశు సంక్షేమాధికారి లెనినా తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీడీ శిరిష ఇచ్చిన నివేదికలో రజిత గత సంవత్సరం పాటు విధులకు గైర్హాజరు కావడంతో మూడుసార్లు మెమోలు జారీ చేసిన స్పందన లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపునకు చర్యలు తీసుకున్నామన్నారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న కంటైనర్

మహబూబాబాద్ క్రైం : పశువులను భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా పశువులను తరలిస్తున్న కంటైనర్ రావడంతో పరిశీలించారు. అందులో సుమారు 45 ముసలి ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. సదరు ఎద్దులు వయసు మీరాయని, అవి వ్యవసాయానికి పనికి రాకుండా ఉండడంతో వ్యాపారులు కబేళాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. కాగా ఎద్దులను స్థానిక పశువైద్యాధికారికి అప్పగించారు. వాటిని పరీక్షించిన వైద్యులు వ్యవసాయానికి పనికి వస్తాయా? పనికిరావా? ధ్రువీకరించి వాటిని పనికి వస్తే గోశాలలకు, పనికిరాకపోతే కబేళాలకు పంపనున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

సీనియర్ పాత్రికేయుడు వీఏఎన్ రాజు మృతి



కాజీపేట టౌన్: కాజీపేటకు చెందిన సీనియర్ పాత్రికేయుడు వీఏఎన్ రాజు (87) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి పరిస్థితి విషమించి రహమత్‌నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.

రాజు ఆంధ్రప్రభ దినపత్రికలో పాత్రికేయుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. 1994లో ప్రెస్‌క్లబ్ తాత్కాలిక అధ్యక్షుడిగా, 2006లో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. మృతుడికి భార్య రత్నావతి, కుమారుడు సుబ్రహ్మణ్యం, కుమార్తెలు కనకరత్నం, నాగమణి ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రాజు 1962లో కాజీపేటకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. రాజు భౌతికకాయానికి సోమవారం ఉదయం వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి దుంపల పవన్, జర్నలిస్టు సంఘాల నాయకులు దాసరి కృష్ణారెడ్డి, పీవీ కొండల్‌రావు, లెనిన్, వి.నారాయణరెడ్డి, శంకర్‌రావు శెంకేసి, పెరుమాండ్ల వెంకట్, శివకుమార్, వెంకట్, విఠల్, దయాసాగర్‌తో పాటు కాజీపేట, మడికొండ ప్రాంతాలకు చెందిన విలేకరులు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పలువురు నాయకులు కూడా రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కాజీపేట చౌరస్తాలో స్థానిక విలేకరులు రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాజీపేట విద్యానగర్‌లోని శ్మశానవాటికలో రాజు అంత్యక్రియలను నిర్వహించారు.

కాళేశ్వరంలో వరుణయాగం

వర్షాలు సక్రమంగా కురవాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ పూజలు

కాళేశ్వరం(జయశంకర్ జిల్లా): వానలు సక్రమంగా కురవాలని, పంటలు పం డి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీముక్తీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సహస్ర ఘటాభిషేకం, వరుణయాగాన్ని అర్చకులు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు.

అంతకుముందు మంగళ వాయిద్యాలతో ఆలయం నుంచి త్రివేణి సంగమ గోదావరి వరకు వెళ్లి కలశాలతో నీటిని తీసుకొచ్చి స్వామి వారికి సహస్ర ఘటాలతో అభిషేకాలు నిర్వహించి వరుణయాగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, జడ్పీటీసీ హసీనాబాను, ఎంపీపీ వసంత, సర్పంచ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.



గోదావరికి పూజలు చేస్తున్న అర్చకులు , భక్తులు

కాళేశ్వరం అభివృద్ధిపై నేడు సీఎం సమీక్ష

శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై హైదరాబాద్‌లో మంగళవారం సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించనున్నారు. గతేడాది కాళేశ్వరం ప్రాజెక్టు భూమిపూజ కోసం వచ్చినప్పుడు రూ.25కోట్లు మంజూరు చేయగా ఇటీవల పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి పనులను ఖరారు చేశారు. త్వరలో టెండర్లు నిర్వహించనుండడంతో సీఎం కేసీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్‌తోపాటు ఆలయ ఈవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొననున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి

పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

దాడిని ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు



ఉపాధ్యాయున్ని పరామర్శిస్తున్న ఎంఈవో

గణపురం(జయశంకర్ జిల్లా): జయశంకర్ జిల్లాలోని గణపురం మండల కేంద్రంలోని హరిజన కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పుజారి సుదయ్యపై సోమవారం ఉదయం ఇదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు దాడిచేశారు. పాఠశాల సమీపంలో నివాసముంటున్న అలూరి మొగిలి కుమార్తె, అల్లుడు చుట్టపుచూపుగా గణపురం వచ్చారు. గత శనివారం ఉదయం వీరి ఐదు సంవత్సరాల కూతురు పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లింది. ఈ సమయంలో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడు సుదయ్య చిన్నారిని పలకరించి మాట్లాడాడు. అనంతరం ఆ చిన్నారిని ఇంటికి వెళ్లమని చెప్పాడు. ఈ విషయంపై చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాపను వేధించాడంటూ సోమవారం పాఠశాలకు వచ్చిన సుదయ్యపై ముకుమ్మడిగా దాడిచేశారు. ఈ సంఘటన విషయమ్మై ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. అసలు సంఘటన వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికానున్నాయి. కాగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు విచారణ ప్రారంభించారు. దాడిలో గాయపడిన ఉపాధ్యాయుడు సుదయ్యను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుదయ్యను ఎంఈవో చిలువేరు సురేందర్ పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనను వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి.

రూ.100, 50 నోట్ల రద్దు ప్రచారంలో నిజం లేదు

ఎస్‌బీఐ వరంగల్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ మురళి

గిర్మాజిపేట(వరంగల్): రూ.100, 50 కరెన్సీ నోట్లు సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు రద్దు అవుతాయంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని భారతీయ స్టేట్ బ్యాంక్ వరంగల్ ప్రధాన శాఖ ముఖ్య మేనేజర్ నందం మురళి చెప్పారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ నుంచి తమకు ఏలాంటి సమాచారంలేదన్నారు. పది రూపాయల నాణాలు చెల్లవంటూ ఇటీవల జరిగిన ప్రచారం తరహాలోనే ఈ ప్రచారం కావొచ్చని, ప్రజలు ఈ ప్రచారాన్ని నమ్మరాదని సూచించారు.



నీటితో నిండిన పంప్‌హౌజ్ ప్రదేశం

వర్షంతో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఆటంకం

కాళేశ్వరం: వర్షంతో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలుగుతోంది. మూడు నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా ప్రాజెక్టు నడుస్తున్న కన్నెపల్లి, అన్నారం పంప్‌హౌజ్‌ల్లోకి నీరు చేరడంతో ప్రాజెక్టు పనులకు ఆటంకం కలుగుతోంది. కాంట్రాక్టు సంస్థ అధికారులు నీటిని తోడేందుకు ప్రయత్నిస్తున్నారు.

వసతులను పరిశీలిస్తూ..
ప్రగతిపై ఆరా తీస్తూ...

కేయూలో న్యాక్ బృందం తొలిరోజు పర్యటన ◆ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన విభాగాల అధిపతులు బృందానికి ఘన స్వాగతం పలికిన వీసీ సాయన్న ◆ నేడు, రేపు కొనసాగనున్న పర్యటన



ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న న్యాక్ బృందం



ఎన్‌సీసీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్‌సీ గౌతం



క్యాంపస్‌లోని తెలుగు విభాగంలో వివరాలు సేకరిస్తున్న న్యాక్ బృందం

కేయూ క్యాంపస్ (కాళోజీ జంక్షన్): నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని విద్యా ప్రమాణాల పరిశీలనకు శ్రీకారం చుట్టింది. మధ్య ప్రదేశ్‌లోని మహాత్మగాంధీ చిత్రకూట్ గ్రామోద్యోయ విశ్వ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎన్‌సీ గౌతం నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం కేయూకు చేరుకుంది. వారికి కేయూ వీసీ ప్రొఫెసర్ ఆర్.సాయన్న పరిపాలన భవనం వద్ద ఉదయం 10గంటలకు స్వాగతం పలికారు. బృందంలోని గౌతం సన్యాల్, కన్హయ్య అహుజ, ఏవీ సింగ్ మధ్నావత్, సీహెచ్‌పీ పాండే, సంజీవ్‌పురి, వైకే గుప్తాలకు వీసీ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎన్‌సీసీ కేడెట్లు కవాతు నిర్వహించి వందనం సమర్పించారు.

అనంతరం పరిపాలన భవనంలో వీసీ సాయన్న న్యాక్ బృందానికి వర్సిటీ ప్రొఫైల్స్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం న్యాక్ ప్రతినిధులు బృందాలుగా విడిపోయి క్యాంపస్‌లో పర్యటన ప్రారంభించారు. సోషల్ సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విభాగాలను ఒక బృందం, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం,సెరీకల్చర్, కామర్స్ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, తెలుగు, పొలిటికల్‌సైన్స్, స్టాటిస్టిక్స్ విభాగాలను రెండో బృందం, ఫార్మసీ, ఫిజిక్స్, మ్యాథ్స్, లైబ్రరీ, ఎకనమిక్స్, ఎడ్యుకేషన్, లైబ్రరీ సైన్స్ విభాగాలను మూడో బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే మహిళా అధ్యయన కేంద్రం, ఫారిన్ రిలేషన్స్ ఆఫీస్, ఎన్ఎస్ఎస్, ఇండస్ట్రి లింకేజీ విభాగం, యోగా సెంటర్, పరీక్షల విభాగాలను కూడా సందర్శించారు. డీన్ ప్రొఫెసర్ శ్రీనాథ్, సీనియర్ ప్రొఫెసర్లు సారంగపాణి, గోపికృష్ణ న్యాక్ బృందం వెన్నంటి వుండి అవసరమైన సమాచారం అందచేశారు.

పర్యటన ఇలా...

ఉన్నతాధికారులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం న్యాక్ బృందం పర్యటన సాగింది. బృందం సభ్యులు హిందీలో మాట్లాడుతుండడంతో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని ట్రాన్స్‌లేటర్‌గా ఏర్పాటు చేశారు. సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్ డీన్‌లను కలుపుకుని ఆయా విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల హెడ్స్ తమ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాక్ ప్రతినిధులు ల్యాబ్‌లు, తరగతి గదులు తిరిగి స్థితిగతులను చూశారు. సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి..

క్యాంపస్‌లో ఆయా డిపార్టుమెంట్లకు చెందిన విభాగాధితులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన తర్వాత, విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి న్యాక్ బృందం నోట్ చేసుకుంది. విద్య, పరిశోధనలతో పాటు మౌలిక వసతులకు వర్సిటీలో ఏ విధమైన ప్రాధాన్యం ఉందనే విషయంపై పరిశీలన చేసింది. పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో చెప్పిన అంశాలను వర్సిటీ అధికారులు నివేదిక రూపంలో న్యాక్ బృందానికి అందచేశారు.

విదేశీ విద్యార్థుల కళ..

న్యాక్ బృందం పర్యటన వేళ కేయూ క్యాంపస్ విదేశీ విద్యార్థులతో కళకళలాడింది. పరిశోధనల కోసం సైన్స్ డిపార్టుమెంట్లకు వారు తరలిరావడంతో సందడి కనిపించింది. అన్ని డిపార్టుమెంట్‌లలో పూర్తి స్థాయిలో విద్యార్థులు, అధ్యాపకులు హాజరు కావడంతో క్యాంపస్ నూతన కళను సంతరించుకుంది.

పూర్వ విద్యార్థుల సమావేశం..

యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో భేటీ అయ్యారు. కామర్స్ విభాగం సెనినార్ హాల్‌లో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పురప్రముఖులతో కుడా భేటీ అయ్యారు. మహబూబాబాద్ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, బీఆర్ అంబేద్కర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.సీతారామారావు, మాజీ సెనేట్ మెంబర్ బండా ప్రకాశ్, నవలా రచయిత అంపశయ్య నవీన్, రిటైర్డు ప్రొఫెసర్లు కాత్యాయని విద్మహే, డాక్టర్ రాంకిషన్, కాళేశ్వర్‌రావు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన వివరాలు...

న్యాక్ బృందం పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం క్యాంపస్‌లోని కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్పోర్ట్స్ బోర్డు, అడ్మిషన్ల డైరెక్టరేట్, ఎస్సీ,ఎస్టీ సెల్, బీసీ సె ల్, ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రిన్సిపాల్ కార్యాలయం, ఇతర విభాగాలను సందర్శిస్తారు.

రేపు నివేదిక..

న్యాక్ ప్రతినిధులు సోమ, మంగళవారాల్లో తమ పరిశీలన ద్వారా సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో ఈ నెల 30న వెలువరించనున్నారు. అదే రోజు సాయంత్రం వీసీతో జరిగే సమావేశంలో ఈ రిపోర్టును అందజేస్తారు. వారు పేర్కొన్న అంశాల ఆధారంగా గ్రేడ్ కేటాయింపు జరుగుతుంది. వర్సిటీ అభివృద్ధి, నిధుల కేటాయింపు న్యాక్ ఇచ్చే గ్రేడ్‌పైనే ఆధార పడి ఉంటుంది. దీంతో ఎ ప్లస్ గ్రేడ్ దక్కేందుకు అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా శ్రమిస్తున్నారు.



న్యాక్ బృందం సభ్యులతో మాట్లాడుతున్న ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్

పరిశీలించిన అంశాలు ఇవే..

డిపార్టుమెంట్ల వారీగా ప్రొఫెసర్లు ఎందరు.. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎందరు.. ఖాళీలు ఎన్ని.. కాంట్రాక్టు పద్ధతిలో ఎందరు పనిచేస్తున్నారు... ఇలా పలురకాల విషయాలను న్యాక్ ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. డిపార్టుమెంట్లు సాధించిన ప్రగతి ఏమిటి... పొందిన గ్రాంట్ ఎంత... రీసెర్చ్ ప్రాజెక్టులు ఎన్ని.. వచ్చిన డబ్బు ఎంత.. దేనికి ఖర్చు చేశారు.. ఖర్చు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా.. అని ప్రశ్నించారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలు ఏమిటి... విద్యార్థుల అడ్మిషన్లలో స్త్రీ, పురుష నిష్పత్తి ఎంత అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సైన్స్ గ్రూపులతో పాటు ఆర్ట్స్, సోషల్ సైన్స్ గ్రూపుల్లో సాప్ డిపార్టుమెంట్లు పొందిన గ్రాంటు ఎంత... ఏ విధంగా ఖర్చు చేశారు... అడ్వజయిరీ కమిటీ మీటింగ్‌లు నిర్వహించారా.... నిర్వహిస్తే ఎన్ని నెలల వ్యవధిలో నిర్వహించారు... నిధులను పద్ధతి ప్రకారం ఖర్చు చేశారా... అనే అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. డిపార్టుమెంట్ల అధ్యాపకులు ప్రచురించిన పుస్తకాలు, రాసిన ఆర్టికల్స్‌పై సమాచారం సేకరించారు.



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు..

న్యాక్ పర్యటనను పురస్కరించుకొని సోమవారం రాత్రి యూనివర్సిటీ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ప్రదర్శించిన పేరిణి నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. న్యాక్ పీర్ కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.

ప్రజాస్వామ్యంలో మార్పు రావాలి

80 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం..

జైలుశాఖ డైరెక్టర్ జనరల్ వీకే సింగ్



మాట్లాడుతున్న జైలుశాఖ డైరెక్టర్ జనరల్ వీకే.సింగ్

కృష్ణకాలనీ(జయశంకర్ జిల్లా): ప్రజాస్వామ్యంలో మార్పు వచ్చే దిశగా ప్రతీ ఒక్కరు తమ పద్ధతులు మార్చుకోవాలని జైలుశాఖ డైరెక్టర్ జనరల్ వీకే సింగ్ అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో జిల్లా సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నిరక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉందని, ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశం వెనుకంజలో ఉండటం బాధకరమన్నారు. ఇందుకు గాను ప్రతీ ఒక్కరు మననుంచే మార్పు రావాలని కోరుకుంటూ.. అందరు విద్యనభ్యసించేలా చర్యలు చేపట్టాలని, ప్రపంచంలోని 30 శాతం నిరక్షరాస్యుల్లో భారతదేశంవారే ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో ఆకలితో బాధపడేవారి శాతం ఎక్కువగా ఉందని, ప్రస్తుతం బంగ్లాదేశ్, నేపాల్, బూటన్, చివరకు పాకిస్తాన్ కంటే వెనుకంజలో భారతదేశం ఉందన్నారు. ప్రజల్లో మార్పు రాకుంటే గడిచిన 70 సంవత్సరాల్లో లేని అభివృద్ధి.. రాబోయే 70 సంవత్సరాల్లో కూడా చూడలేమని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మండల, గ్రామ కమిటీలు వేసుకొని ప్రజలంతా మార్పు దిశగా అడుగులేయాలని సూచించారు. గ్రామస్థాయిలోని సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకునేలా సమష్టిగా ఉండాలన్నారు.

తెలంగాణ జైలు బంగ్లాదేశ్ తదితర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా చేశామని, 1400 మంది సిబ్బందితో కలిసి.. కట్టుగా అభివృద్ధికి దోహదం చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జైళ్లను సైనిక్ స్కూలుగా మార్చి.. వేలిముద్ర వేసే 80 వేల మందికి పైగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సిటిజన్ ఫోరం అధ్యక్షులు శ్యాంప్రసాద్, కమిటీ సభ్యులతో పాటు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సానిటరీ విభాగంలో మార్పు

● ఇద్దరికి ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు

జనగామ టౌన్: జనగామ మునిసిపాలిటీ సానిటరీ విభాగంలో మార్పులు చేస్తూ సోమవారం కమిషనర్ టీ.ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తాటి భిక్షపతిని 1వ వార్డు నుంచి 20వ వార్డుకు, మధును 21 నుంచి 28 వార్డుకు సానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు.

నేడు జానపద జాతర

జనగామ, ఆంధ్రజ్యోతి : ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న జానపద జాతర నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. జానపద కళలకు తరగని సంపద జిల్లాలో ఉందని ఆ కళారూపాల ప్రదర్శనను మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మరుగున పడిపోతున్న పలు జానపద కళారూపాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తామన్నారు. రెండేళ్లుగా భాషా సాంస్కృతిక శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ జానపద జాతరను జనగామ జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా జానపద కళాకారులతో రైల్వే స్టేషన్ నుంచి జూబ్లీ ఫంక్షన్‌హాల్ వరకు మధ్యాహ్నం 2 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ ఉత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సబ్సిడీ రుణం కాజేసిన కేసులో

నిందితుల అరెస్టు

కొడకండ్ల: మండలంలోని మొండ్రాయి గ్రామ శివారు గిర్ని తండాకు చెందిన భూక్యా సుందర్ గేదెలు కొనుక్కుంటానని చెప్పి ఎస్టీ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకొని వాటిని కొనకుండానే రుణాన్ని కాజేసిన కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేశారు.

డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ చందనా సర్పే ఇచ్చిన నివేదిక మేరకు వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై వై.సత్యనారాయణ తెలిపారు. 80 శాతం రాయితీతో ప్రభుత్వం అందించిన లక్ష రూపాయలను ఏజెంట్ ధరావత్ వెంకట్రాం, లబ్ధిదారుడు భూక్యా సుందర్‌లు పంచుకుని గేదెలు కొనకుండానే డబ్బులు వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో వారిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కమిషనర్ క్వార్టర్ అవసరమా?

● రూ. 30 లక్షలతో ప్రతిపాదనలు

● నేడు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావన

జనగామ, ఆంధ్రజ్యోతి: జనగామ మునిసిపల్ అధికారులు వచ్చే ఆదాయం పట్టించుకోరు కానీ అవసరం లేని పనులకు లక్షలాది రూపాయలు ఖర్చుచేసేందుకు మాత్రం అత్యుత్సాహం చూపిస్తున్నారు. ప్రస్తుతం మునిసిపల్ కార్యాలయం కోసం నిర్మించిన(కలెక్టరేట్) భవనం వెనుకనే కమిషనర్, ఇంజనీర్ల కోసం కొన్నేళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ ఉన్నాయి. వాటిని కొంత ఖర్చు చేసి మరమ్మతు చేస్తే కమిషనర్ నివాసానికి ఉపయోగించుకునే ఆవకాశం ఉంది. కానీ నిధులు ఎలా ఖర్చుచేయాలంటూ నిత్యం ఆలోచించే అధికారులు 21 వార్డులోని తహసీల్ కార్యాలయం సమీపంలోని కెనరా బ్యాంక్ ముందున్న మునిసిపల్ స్థలంలో కొత్తగా రూ.30 లక్షల వ్యయంతో కమిషనర్ క్వార్టర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేస్తూ బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో తీర్మానానికి ఎజెండాలో చేర్చారు. దీంతో పట్టణ ప్రజల్లో నిరసన వ్యక్తమవుతోంది.

అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి..

కమిషనర్ క్వార్టర్ నిర్మించేందుకు కేటాయించిన కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న మునిసిపల్ స్థలంలో గతంలో కూరగాయాల మార్కెట్ నిర్వహించేవారు. దీనివల్ల మునిసిపాలిటీకి ఎంతో కొంత ఆదాయం సమకూరేది. ఆ తర్వాత ఆ స్థలం ఖాళీగా ఉన్నప్పటికీ అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలనే ఆలోచన కూడా అధికారులకు రాలేదు. కానీ ప్రస్తుతం కమిషనర్ కోసం క్వార్టర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అక్కడ షాపింగ్ కాంపెక్స్ నిర్మిస్తే ఏటా రూ.30 నుంచి 50 వేల వరకు ఆదాయం మునిసిపాలిటీకి వస్తుంది. వచ్చే ఆదాయాన్ని పట్టించుకోకుండా క్వార్టర్ నిర్మాణం ప్రతిపాదనలు చేయడం పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్ కార్యాలయం వెనుక నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ ఇంజనీర్ నివాస భవనం



కొత్తగా కమిషనర్ క్వార్టర్ నిర్మించాలనుకుంటున్న స్థలం (ఇక్కడ ఇంతకు ముందు కూరగాయల మార్కెట్ ఉందేది)

నాకు తెలియకుండానే ఎజెండాలో చేర్చారు..

- వంగాల కళ్యాణి, కౌన్సిలర్

21వ వార్డులో కమిషనర్ క్వార్టర్ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదన నాకు కనీసమాత్రంగా చెప్పకుండానే అధికారులు బుధవారం జరిగే కౌన్సిల్ ఎజెండాలో చేర్చారు. కమిషనర్ క్వార్టర్ నిర్మాణం వల్ల నిధుల దుర్వినియోగమే తప్ప ఎలాంటి లాభం లేదు. ఆ స్థలం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం మాత్రమే కేటాయించబడి ఉంది. ప్రస్తుతం ఉన్న మునిసిపల్ ఇంజనీర్ క్వార్టర్లకు మరమ్మతు చేయించి అందుబాటులోకి తేస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సిరెడ్డి

● కలెక్టరేట్ ఎదుట కేజీబీవీ ఉద్యోగుల ధర్నా

జనగామ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని కేజీబీవీ ఉద్యోగులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు, ఇతర సిబ్బందిని రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు 10వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అన్ని సెలవులు వర్తింపజేయాలని, వేతనంతో కూడిన ఆరునెలల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కేజీబీవీ స్టాఫ్ పాటర్న్ ప్రకారం వార్డెన్ పోస్టు మంజూరు చేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పనిభారం ఉన్నందున వార్డెన్, రెండవ ఎఎన్‌ఎం ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ రావు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లలిత, జిల్లా నాయకులు చంద్రశేఖర్ రావు, శ్రీనివాస్, అశోక్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, జంపయ్య, కేజీబీవీ ఉద్యోగులు క్రిష్ణవేణి, స్వప్న, దినప్రియ, నవీన, రేణుక, కల్పన, మంజూల, జ్యోతి, శైలజ, చైతన్య, కౌసల్య రాజమణి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న నర్సిరెడ్డి

పిట్టగోడలపై గ్రిల్స్

● వృద్ధుడి మృతితో అప్రమత్తమైన అధికారులు

జనగామ టౌన్: జనగామ కలెక్టరేట్‌లో పిట్టగోడపై నుంచి జారిపడి వృద్ధుడు మృతిచెందిన సంఘటనతో అప్రమత్తమైన అధికారులు గోడలకు రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఈ నెల 22న కలెక్టరేట్‌లో అధికారులను కలిసేందుకు వచ్చిన జనగామ మండలం పెద్దరాంచర్ల గ్రామానికి చెందిన వంగ గోపాల్‌రెడ్డి(85) పిట్టగోడపై నుంచి జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంటనే స్పదించిన కలెక్టర్ కార్యాలయంలో భద్రతపరంగా మెట్లు, పిట్టగోడపై గ్రిల్స్ ఏర్పాటు చేయించారు.

వివాదంలో రేషన్ బియ్యం

రఘునాథపల్లి రూరల్ : మండలంలోని మేకలగట్టు గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారి నుంచి సుమారు 12 క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం గ్రామస్థులు భిక్షపతి నాయక్, వీరన్న, భద్రయ్య, గోపాల్‌లు పట్టుకున్నారు. ఈ విషయాన్ని వీఆర్‌వో కొమురయ్యకు తెలియజేశారు. అనంతరం సివిల్ సప్లయీస్ డీటీ హరిప్రసాద్, మరో డీటీ సమ్మక్క గ్రామానికి వెళ్లి స్థానికులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డీలర్‌కు ఎల్లయ్యకు అప్పగించారు. అయితే ఎల్లయ్యతో పాటు మరో డీలర్ మంగమ్మే ఈ రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటుండగా అధికారులు తిరిగి వారికే ఆ బియ్యాన్ని అప్పగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు ఇద్దరు రేషన్ డీలర్లు మాట్లాడుతూ బియ్యం వ్యాపారి కొనుగోలు చేసిన బియ్యానికి తమకు ఎలాంటి సంబంధం లేదని, అతను వేరే గ్రామంలో వాటిని కొనుగోలు చేసుకుని ఈ గ్రామానికి వచ్చి, ఇంటింటికీ తిరిగి బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారని అధికారులకు వివరించారు. దీంతో ఈ సంఘటన వివాదాస్పదంగా మారింది. ఇదిలా ఉండగా సందెట్లో సడేమియా అన్నట్లుగా బియ్యం కొనుగోలు దారుడు అక్కడి నుంచి తన వాహనంతో పరారయ్యాడు.

గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న జేసీ వనజాదేవి

జనగామ టౌన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో వివిధ సమస్యలపై ప్రజలు వెల్లువలా దరఖాస్తులు అందించారు. మునిసిపల్ వైస్ చైర్మెన్ నాగారపు వెంకట్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులు ప్రభుత్వం తమకు పట్టాలు అందించి ఐదేళ్లు దాటినా ఇండ్ల స్థలాలు చూపించలేదని ఆందోళన చేశారు. కలెక్టర్ శ్రీదేవసేన వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయంపై విచారణ జరిపి అర్హులైన లబ్దిదారులకు వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తానన్నారు. బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళ రైతు దుద్దెడ సగుణమ్మ తనకు ప్రభుత్వం ద్వారా మూడెకరాల భూమి కేటాయించాలని వినతిపత్రం అందించారు. ఆమెను కలెక్టర్ ఆప్యాయంగా పలకరించారు. ఇంతవరకు భూమి కేటాయిం చకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి ఈ మేరకు స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్రీవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.మహముద్ ఆధ్వర్యంలో సభ్యులు ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాల ద్వారా చేయూత అందించాలని వినతిపత్రం అందించారు. చీటకోడూర్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణ భార్య సుశీల, తనకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరింది. రోడ్డు ప్రమాదంలో గాయపడి నిస్సహాయుడిగా మారిన ఎండీ. అబ్బాస్ అనే యువకుడు ప్రభుత్వం ద్వారా వైద్య చికిత్స అందించాలని వేడుకున్నారు. గ్రీవెన్స్‌లో పెన్షన్‌లు, భూ సమస్యలు, గ్రామాల సమస్యలపై మొత్తం 82 మంది దరఖాస్తులు అందించారు. గ్రీవెన్స్‌లో జేసీ వనజాదేవి, డీఈవో యాదయ్య, డీఆర్‌డీఏ పీడీ మేకల జయచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద 'ఇందిరమ్మ' బాధితుల ఆందోళన



విశ్వ క్రీడా వేదికపై భారత్ పేరు వినిపించేలా చేసిన ఘనాపాటి.. దశాబ్దాల క్రితమే ఒలింపిక్ క్రీడల్లో దేశానికి ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా మూడుసార్లు పసిడి పతకాలు పండించిన సిసలైన విజేత.. ఆయన తర్వాత ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో దేశానికి ఒక్క పతకం కూడా దక్కలేదు. అందుకే పెద్దలంటారు.. "కొందరు చిరస్థాయిగా నిలిచిపోతారు.. వారి స్థానాలను ఎవరూ భర్తీ చేయలేరని". దేశం, వేషం, భాష తేడా లేకుండా క్రీడాభిమానులందరి మదిదోచిన హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి నేడే. ఈసందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జాతీయ క్రీడ హాకీకి ఆదరణ కొరవడిన వైనంపై కథనమిది.



హాకీ ఆడుతున్న ఏసీపీ నాగరాజు (ఫైల్)

జాతీయ క్రీడ జాడేది?

- ఆదరణకు నోచుకోని హాకీ
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీకి గతమెంతో ఘనం
- జేఎన్‌ఎస్‌లో కానరాని హాకీ కోర్టు
- హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతికి ఏర్పాట్లు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

❑ వరంగల్ అర్బన్ స్పోర్ట్స్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడకు ఆదరణ కరువైంది. దీని గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. జిల్లా క్రీడా ప్రాధికారిక మండలి(డీఎస్‌ఏ) సైతం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీనితో జిల్లాలోని హాకీ క్రీడాకారులు నిరాశ,నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. కోచ్‌లను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇది క్రమంగా కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన వరంగల్‌లో హాకీకి పూర్వవైభవం రావాలంటే ప్రభుత్వం చొరవచూపాలి. పాఠశాల స్థాయి నుంచి జాతీయ క్రీడపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి హాకీ శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేయాలి. వీటిలో శిక్షణ పొందే వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలి.

ఆ ఒక్కటీ మరిచారు..

- హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జెఎన్ఎస్)లో అన్ని క్రీడలకు కోర్టులున్నాయి కానీ హాకీకే లేదు. జెఎన్ఎస్‌లో క్రికెట్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్, టెన్నిస్ తదితర క్రీడలకు విడివిడిగా కోర్టులను ఏర్పాటు చేశారు. వీటికి కోచ్‌లు కూడా ఉన్నారు. ఎవరికి వారు తమ కోర్టులను అన్ని సౌకర్యాలు ఉండేలా అభివృద్ధి చేసుకుంటున్నారు.
- కానీ హాకీ విషయలోనే ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు ఈ క్రీడ అనేది ఒకటి ఉన్నదన్న విషయాన్నే డీఎస్‌ఏ అధికారులు, కోచ్‌లు పూర్తిగా మరిచిపోయారు. హాకీ క్రీడ పట్ల అభిమానం ఉన్నవాళ్ళు శిక్షణ పొందడానికి అవసరైన సౌకర్యాలు ఏ మాత్రం జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో లేవు. అసలు కోర్టే లేకపోవడంతో క్రీడాకారులు హాకీని పట్టించుకోవడం మానేసారు.
- జేఎన్ఎస్‌లోనే కాకుండా కాకతీయ విశ్వవిద్యాలయం, కేఎంసీ, నిట్ తదితర విద్యాసంస్థల్లోనూ హాకీ కోర్టులు లేవు.

2005కు ముందు..

జేఎన్ఎస్‌లో 2005 సంవత్సరానికి ముందు హాకీ కోర్టు ఉండేది. అప్పట్లో క్రీడాకారులకు ఇది శిక్షణా కేంద్రంగా బాసిల్లింది. అనేక మంది క్రీడాకారులు ఈ కోర్టులోనే శిక్షణ తీసుకొని జాతీ స్థాయి పోటీల్లో రాణించారు. పలు పథకాలను సాధించారు. జిల్లాకు చెందిన పలువురు జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలను సైతం పొందారు. ప్రస్తుతం ఏసీపీగా పని చేస్తున్న నాగరాజు వీరిలో ఉన్నారు. హాకీ క్రీడాకారిణి డాక్టర్ బబిత స్పోర్ట్స్ కోటాలోనే కేఎంసీలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. ఇంకొందరు ఎస్ఐలుగా ఉద్యోగాల్లో చేరారు.



పూర్వవైభవాన్ని తీసుకురావాలి



వరంగల్‌లో హాకీకి పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావాలి. ఇందుకు అధికారులు, క్రీడా సంఘాలు పూనుకోవాలి. టోర్నమెంట్స్ కూడా అడపాదడపా జరుగుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఉండాలి.

\- ప్రభాకర్ రెడ్డి, కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్

హాకీ స్టిక్స్ కొనేవారు లేరు



వరంగల్‌లో హాకీకి ఆదరణ పూర్తి తగ్గిపోయింది. ఇప్పుడు హాకీ స్టిక్స్ కొనేవారే లేకుండాపోయారు. ఇది వరకు మా షాపులో ఏటా 500ల నుంచి 1000 స్టిక్‌ల వరకు అమ్మకం చేసేది. హాకీ స్టిక్స్‌కు మంచి డిమాండ్ ఉండేది. ఇప్పుడు సంవత్సరానికి ఒక్కటి కూడా కొనేవారే లేకుండా పోయారు.

\- పులి అనిల్, అనిల్ స్పోర్ట్స్ షాపు యజమాని

హాకీని విస్మరించడం దురదృష్టకరం



1979 నుంచి నేను హాకీని ఆడాను. 1992లో నేషనల్స్‌లో ఆడాను. అప్పట్లో మా ప్రాక్టీస్ అంతా జేఎన్ఎస్‌లోని జరిగేది. హాకీ క్రీడాకరులతో గ్రౌండ్ అంతా కళకళలాడుతూ కనిపించేది. ఇప్పుడు ఆ ప్రాభవమే లేదు. 2011లో జనగామలో డీఎస్పీగా పని చేసినప్పుడు వరంగల్‌లో హాకీ కోర్టు ఏర్పాటు కోసం ఎంతో ప్రయత్నించాను. హాకీ కోర్టు ఏర్పాటు కోసం అప్పటి కలెక్టర్ రాహుల్ బొజ్జా హామీ ఇచ్చారు. ఈ దిశగా ప్రయత్నం జరిగినా పూర్తిగా కార్యరూపం దాల్చలేకపోయింది.

\- కె.నాగరాజు, ఏసీపీ, జాతీయ హాకీ క్రీడాకారుడు

హాకీని బతికించేందుకు శ్రమిస్తున్నాం



హాకీ క్రీడను బతికించుకునేందుకు శ్రమిస్తున్నాము. ఈ క్రీడను ప్రోత్సహించేందుకు మా వంతుగా వరంగల్ హాకీ అసోసియేషన్ ద్వారా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. డీఎస్ఏ పక్షాన ఇప్పటి వరకు హాకీ కోచ్ లేదు. రాహుల్ బొజ్జా కలెక్టర్‌గా ఉన్నప్పుడు నన్ను హాకీ కోచ్‌గా నియమించినా డీఎస్ఏ అధికారులు ఇప్పటి వరకు జాయిన్ చేసుకోలేదు.

\- ఎండీ హుస్సేన్, హాకీ కోచ్, మామునూరు

రైతు సమన్వయ కమిటీలు వస్తున్నాయ్..



- వచ్చే నెల 9 నాటికి ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- నాలుగు అంచెలుగా సమితులు
- నామినేటెడ్ పద్ధతిలో సభ్యుల నియామకం
- ఎంపిక బాధ్యతలు మంత్రులకు అప్పగింత
- వచ్చేనెల 15 నుంచి మళ్లీ రైతు సర్వే

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. వచ్చే నెల 9లోగా వీటి ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వచ్చేనెల 15 నుంచి మళ్లీ రైతు సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం జీవోను జారీ చేసింది. రైతులందరిని ఒకే వేదికపైకి తీసుకురావాలనే యత్నాల్లో ప్రభుత్వం నిమగ్నమైంది. ఇందుకు సమన్వయ సమితుల ఏర్పాటు దోహదపడుతుందని సర్కారు భావిస్తోంది.

❑ హన్మకొండ, ఆంధ్రజ్యోతి

రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రభుత్వం వాటి ఫలాలు రైతులందరికి చేరేలా చూడడంలో ఈ సమన్వయ సమితులు కృషి చేస్తాయి. సమన్వయ సమితులను నామినేషన్ పద్ధతి ద్వారా నియమిస్తారు. ఈ సమితులు నాలుగంచెలుగా ఉంటాయి. గ్రామ, మండల, జిల్లా స్థాయి రైతు సమన్వయ సమితుల్లో 24 మంది చొప్పున సభ్యులు ఉంటారు. రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితిలో మాత్రం 42 మందికి చోటు లభిస్తుంది. ప్రతీ సమితికి ఒక కో ఆర్డినేటర్ కూడా ఉంటారు. ఈయనను కూడా నామినేషన్ పద్ధతి ద్వారానే నియమిస్తారు. రైతుల సంక్షేమం, వారి అభ్యున్నతికి, పంటలకు గిట్టుబాటు ధర దక్కేట్లు చూడడానికి రూ.500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

స్థానికులకే ప్రాధాన్యం..

- స్థానికంగా నివసిస్తూ పట్టాదారులైన రైతులనే సమితుల్లో సభ్యులుగా తీసుకుంటారు. మొత్తం సభ్యుల్లో ఒకటింట మూడో వంతు మహిళలు ఉండేలా చూస్తారు.
- సమితులకు రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ నోడల్ విభాగంగా ఉంటుంది.
- వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.
- జిల్లా స్థాయిలో కలెక్టర్లు నోడల్ అధికారులుగా ఉంటారు.
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారు.

నామినేట్ బాధ్యతలు వీరికే..

- **వరంగల్ అర్బన్, రూరల్, జనగామ :** ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- **జయశంకర్, మహబూబాబాద్ :** రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి అజ్మీరా చందూలాల్

మరోసారి రైతుల వివరాల సేకరణ..

గ్రామాలవారిగా రైతుల జాబితాలను తయారు చేయడానికి మరో సారి రైతు సర్వేను నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు నెల రోజుల పాటు ఈ సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో రెవెన్యూ ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటిస్తారు.

రేపు కడియం సమీక్ష

గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర రైతు సమన్వయ సమితుల ఏర్పాటుపై రేపు(ఈనెల 30న) ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. హన్మకొండ నక్కలగుట్టలోని నందనగార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే సమీక్షా సమావేశంలో అయిదు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, రెవెన్యూశాఖ, నీటిపారుదల, ప్రజారోగ్య శాఖ అధికారులు పాల్గొంటారు. ఇదే సమావేశంలో మిషన్ భగీరథ పనులపైనా సమీక్ష జరుపుతారు.

మహాజాతరపై నిర్లక్ష్యం



మేడారం మహాజాతర.... గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్కసారలమ్మను దర్శించుకునేందుకు కోట్లాది మంది భక్తులు మేడారం బాట పట్టనున్నారు. మరో ఐదు నెలల్లో జాతర జరగబోతుంటే ఏర్పాట్లు మాత్రం ఇంకా మొదలు కాలేదు. గిరిజన శాఖ మంత్రి ప్రాతినిధ్యంలోని ఈ జాతరకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయింపులు కాకపోవడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. జాతర సమీపిస్తున్న నిధుల కేటాయింపులో ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే...

- మరో ఐదు నెలల్లో మేడారం మహాజాతర
- ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరకు నిధులు కరువు
- అభివృద్ధి పనులపై దృష్టిసారించని ప్రభుత్వం
- రూ.150 కోట్ల అంచనాలతో పంపిన ప్రతిపాదనల తిరస్కరణ
- రూ.100 కోట్ల అంచనాలతో మరోసారి ప్రతిపాదనలు
- సాక్షాత్తూ గిరిజన శాఖ మంత్రి ఇలాఖాపై చిన్నచూపు



❑ ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

మేడారం జాతర 2018 జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనుంది. ఇందుకు ఇంకా ఏర్పాట్లు మొదలు కాలేదు. మరో ఐదు నెలల్లో జాతర జరగబోతుంటే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంపై భక్తుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా మేడారం మహాజాతర జరగబోతోంది. దీంతో ఈ జాతరను వైభంగా నిర్వహించేందుకు అధికారులు గత 8 నెలల నుంచే కసరత్తు చేపట్టారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఇప్పటికే పలుమార్లు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు చేపట్టారు. 2016లో మేడారం జాతర సందర్భంగా చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆ జాతరలో రూ.183 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే అప్పుడు రూ.101.83కోట్లను కేటాయించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం మేడారం మహాజాతర కోసం గత మార్చి నెలలో రూ.152 కోట్లతో జాతరలో చేపట్టబోయే పనులపై అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించారు. అయితే ప్రభుత్వం ఈ ప్రతిపాదనలు తిరస్కరించింది. దీంతో

సమీక్షించడంతోనే సరిపెట్టారు..

మరోసారి అధికారులు అంచనాలు కుదిస్తూ జూన్ 15వ తేదీన రూ.100కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. జూన్ 29న మంత్రి చందూలాల్ సమక్షంలో వివిధ శాఖల కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రూ.100కోట్లతో చేసిన ప్రతిపాదనలకు సూచన ప్రాయంగా ప్రభుత్వం అంగీకరించినట్లు ప్రకటించారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం మంజూరు చేయకపోవడం గమనార్హం.

ఎక్కడి పనులు అక్కడే...

ఈసారి జాతరకు సుమారు కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుమారు 10వేల మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటితోపాటు 4వేల మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, అలాగే జాతరలో సీసీ కెమెరాలు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అంతేకాకుండా జాతర ప్రాంగణం, జాతర జరిగే చుట్టూ పది కిలోమీటర్ల వరకు తాగునీటి సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జాతరకు వచ్చే రహదారులన్నీ మరమ్మతులు చేపట్టేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు చేశారు.. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ జీవో ఇవ్వలేదు. అభివృద్ధి పనులకు టెండర్ల ఆహ్వానం, కాంట్రాక్టర్ల నియామకం, పనుల పూర్తికి లక్ష్యాల నిర్దేశం, నాణ్యతా పరిశీలన ఇదంతా సవ్యంగా జరగాలంటే ముందస్తుగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

పునరావాస కల్పనలో.. రూరల్ జిగేల్

నాటుసారా తయారీ, విక్రయాలు మానేసినవారికి అండగా నిలవడంలో భేష్

జీఈపీఆర్ఎస్ పథకం అమలులో సత్ఫలితాలు సాధిస్తున్న జిల్లా



రాజీపేటలో గువ్వ భాగ్యమ్మకు గేదెలను అందిస్తున్న ఎక్సైజ్ అధికారులు

❑ పరకాల (వరంగల్ రూరల్ జిల్లా)

నాటుసారా తయారీ, అమ్మకాలు మానేసిన వారికి పునరావాసం కల్పించే విషయంలో వరంగల్ రూరల్ జిల్లా సత్ఫలితాలు సాధిస్తూ రాష్ట్రం దృష్టిని ఆకట్టుకుంటోంది. నాటుసారా తయారీ మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందంజలో ఉంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఈపీఆర్ఎస్(గుడుంబా ప్రభావిత వ్యక్తుల పునరావాస పథకం) అమలులో భేష్ అనిపించుకుంటోంది 'రూరల్'.

జీఈపీఆర్ఎస్ పథకంలో భాగంగా గుడుంబా తయారీ, అమ్మకాలు మానేసిన వారిని గుర్తించి ఒక్కొక్కరికి రూ.2లక్షలు కేటాయిస్తారు. ఇందులో వందశాతం సబ్సిడీ ఇస్తారు. అంటే ఇచ్చే రుణం మొత్తంలో ఒక్కరూపాయి కూడా తిరిగి కట్టాల్సిన అవసరం లేదు. అందుకే ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సంక్షేమ పథకాల్లాగే జీఈపీఆర్ఎస్‌కు కూడా రోజూ వందలాది దరఖాస్తులు ఎక్సైజ్ స్టేషన్లలో అందుతున్నాయి. రూరల్ జిల్లాకు మంజూరైన 122 యూనిట్లలో అన్నీ లబ్ధిదారులకు కేటాయించడం విశేషం. దీంతో చాలామేరకు గుడుంబా అమ్మకాలు, తయారీ కంటికి కనిపించకుండా పోయింది.

122/2000...

రూరల్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లకు 2వేల మందికిపైగా గుడుంబా తయారీ, అమ్మకాలు మానేశామంటూ దరఖాస్తులు సమర్పించారు. వారిలో అర్హులైన 122 మందిని అధికారులు గుర్తించారు. జనవరి 2015 నుంచి సెప్టెంబర్ 2016 వరకు గుడుంబాను తరలిస్తూ, అమ్మకాలు జరుపుతూ కేసులు నమోదైన వారిని అర్హులుగా గుర్తించి, యూనిట్లు అందించారు. రుణంతో కొందరు గేదెలు కొని పాడిరంగంపై దృష్టిసారించగా, ఇంకొందరు గొర్రెల పెంపకాన్ని ఎంపిక చేసుకున్నారు. మరికొందరు ఆటోలు నడపుతూ ఉపాధి పొందుతుండగా, పలువురు మొబైల్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు.

యూనిట్ల కేటాయింపు జరిగిందిలా..

- రూరల్ జిల్లాకు 122యూనిట్లకు గాను రూ. 24.4 కోట్లను అందించి వంద శాతం సబ్సిడీ అందిస్తున్నారు.
- నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్లకు గానూ 36 మంది ఎస్టీలకు, 42 మంది బీసీలకు, 44 మంది ఎస్సీలకు కేటాయించారు.
- కేటాయించిన వాటిలో ఆటోలు 46 యూనిట్లు, గొర్రెలు 39 యూనిట్లు, గేదెలు 35యూనిట్లు, సెల్‌ఫోన్‌షాపులు 2 యూనిట్లు ఉన్నాయి.
- నర్సంపేటకు 21 యూనిట్ల ఆటోలు, 20 యూనిట్లు గేదెలు, 13 యూనిట్ల గొర్రెలు, వర్ధన్నపేటకు 13 యూనిట్ల ఆటోలు, 11 గొర్రెల యూనిట్లు, 5 గేదెల యూనిట్లు, 2 సెల్‌ఫోన్ యూనిట్లు, పరకాలకుగాను 12 ఆటో యూనిట్లు, 15 గొర్రెల యూనిట్లు, 10 గేదెల యూనిట్లను అందించారు.
- గొర్రెల యూనిట్‌లో ప్రతి యూనిట్‌కు 31గొర్రెలు ఉంటాయి. గేదెల యూనిట్‌లో 3 గేదెలను అందిస్తారు.

ఉన్నతాధికారుల సహకారంతో..



రూరల్ జిల్లా అధికారుల సహకారంతో జిల్లాలో పూర్తి స్థాయిలో గుడుంబా తయారీని నిలువరించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలతో గుడుంబా తయారీ మానేసినవారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తున్నాం.

\- జగన్నాథరావు, పరకాల ఎక్సైజ్ సీఐ

జీవితంపై భరోసా వచ్చింది



ప్రభుత్వం అందించిన చేయూతతో జీవితంపై భరోసా వచ్చింది. గతంలో పూట గడవాలంటే గుడుంబా అమ్మక తప్పలేదు. జైలుకు వెళ్లినా, మళ్లీ బయటికొచ్చి గుడుంబా అమ్మేదాన్ని. ప్రభుత్వం 31 గొర్రెలను అందించింది. ఇక వాటిని సాదుకుంటూ ఉపాధి పొందుతాను.

\- కె.సరోజన, పరకాల, లబ్ధిదారురాలు

రోడ్డున పడ్డ బతుకులను కాపాడారు



గుంట భూమి లేక చేసేందుకు పని లేక గుడుంబా అమ్మేవాళ్లం. కుటుంబ పోషణ కోసం గుడుంబాను అమ్మక తప్పలేదు. ప్రభుత్వ డబ్బులతో అధికారులు ఆటోను అందించారు. రోడ్డున పడిన మా బతుకులను కాపాడారు.

\- దుప్పటి పుష్ప, పరకాల

ఈ సాయం మరువలేం



గుడుంబా తయారీ మానేసిన వారికి ఈ తరహాలో ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం కూడా సాయం చేయలేదు. ఈరోజు మేం నాలుగు మెతుకులు తింటున్నామంటే ప్రభుత్వం అందించిన సాయం వల్లే.

\- ఆంబోతు హరిత, గీసుకొండ

The new Chairman of Railway Board?

Current Affairs & GK

A. Ravi Prakash Reddy
Senior Faculty



1. Who is the winner of World Food Prize for 2017?
1) David Grossman
2) Alvin Carl Plantinga
3) Yves Meyer 4) Akinwumi Adesina
5) None of these

2. Find the correct statement?
1) Ram Nath Kovind is the 14th President of India, assumed office on 25 July 2017.
2) Venkaiah Naidu is the 13th Vice-President of India, assumed office on 11 August 2017.
3) Justice Dipak Mishra is the 45th Chief Justice of India, assumed office on 28 July 2017.
4) Achal Kumar Jyoti is the 21st Chief Election Commissioner of India, assumed office on 6 July 2017. 5) All of the above

3. Shanghai Cooperation Organisation (SCO) summit 2017 was held in Astana, Kazakhstan. Who is the President of Kazakhstan?
1) Nursultan Nazarbayev
2) Almazbek Atambayev
3) Emomali Rahmon
4) Shavkat Mirziyoyev 5) None of these

4. International Day Against Drug Abuse and Illicit Trafficking is observed on…
1) June 26 2) July 26 3) August 26
4) September 26 5) October 26

5. Which state government has launched an exclusive 24×7 helpline '181' for women?
1) Andhra Pradesh 2) Karnataka
3) Kerala 4) Tamil Nadu 5) Telangana

6. Which state chief minister has been chosen for the National Agriculture Leadership Award-2017 by the Indian Council of Food and Agriculture (ICFA) under the chairmanship of well known agriculture scientist Prof.M.S. Swaminathan?
1) Uttar Pradesh 2) Madhya Pradesh
3) Telangana 4) Maharashtra
5) Andhra Pradesh

7. The ONGC board recently approved the acquisition (51.11% equity stake) of which of the following public sector companies?
1) IOC 2) BPCL 3) HPCL 4) OIL 5) None

8. Who is the author of the book "I am HIV positive, so what"?
1) Ch.Pradip Kumar Singh
2) Jayanta Kalita 3) Arundhati Roy
4) Chetan Bhagat 5) Salman Rushdie

9. At present the number of Regional Rural Banks (RRBs) in India?
1) 36 2) 46 3) 56 4) 66 5) None of these

10. The winners of Rajiv Gandhi Khel Ratna Award for 2017?
1) Viswanathan Anand and Karnam Malleswari
2) Sachin Tendulkar and Mahendra Singh Dhoni
3) P.V.Sindhu and Dipa Karmakar
4) Jitu Rai and Sakshi Malik
5) Devendra Jhajharia and Sardara Singh

11. The first regional office of New Development Bank (NDB) was opened in..
1) Sao Paulo 2) Moscow 3) Mumbai
4) Shanghai 5) Johannesburg

12. Who is the Pakistan's new High Commissioner to India?
1) Shahid Khaqan Abbasi
2) Sohail Mahmood
3) Khawaja Muhammad Asif
4) Mamnoon Hussain
5) Khurram Dastgir Khan

13. The Government of India's Disin vestment Target for 2017-18?
1) Rs 42,500 crore 2) Rs 52,500 crore
3) Rs 62,500 crore 4) Rs 72,500 crore
5) None of these

14. The Andhra Pradesh Grameena Vikas Bank(APGVB) is a regional rural bank sponsored by….
1) State Bank of India 2) Andhra Bank
3) Syndicate Bank 4) Indian Bank
5) None of these

15. Which of the following countries is NOT a member of G7 group?
1) Germany 2) Britain 3) France
4) Italy 5) Sweden

16. Who is the winner of Men's Singles in 2017 Rogers Cup?
1) Alexander Zverev 2) Roger Federer
3) Pierre-Hugues Herbert
4) Nicolas Mahut 5) None of these

FOR ALL COMPETITIVE EXAMS

17. Match the following?

Summit	Hosting Place
A. G7 Summit 2017	(i) Taormina, Italy
B. G20 Summit 2017	(ii) Hamburg, Germany
C. SCO Summit 2017	(iii) Astana, Kazakhstan
D. APEC Summit 2017	(iv) Da Nang, Vietnam
E. BRICS Summit 2017	(v) Xiamen, China

	A	B	C	D	E
1)	(ii)	(iii)	(iv)	(v)	(i)
2)	(v)	(i)	(iii)	(ii)	(iv)
3)	(iv)	(ii)	(i)	(v)	(iii)
4)	(iii)	(iv)	(ii)	(i)	(v)
5)	(i)	(ii)	(iii)	(iv)	(v)

18. Which city will host the Summer Olympics in 2028?
1) Rio de Janeiro 2) Tokyo 3) Paris
4) Los Angeles 5) None of these

19. Who is Hun Sen?
1) The Prime Minister of Singapore
2) The Prime Minister of Australia
3) The Prime Minister of Bhutan
4) The Prime Minister of Cambodia
5) The Prime Minister of China

20. The new Chairman of Railway Board?
1) Suresh Prabhu 2) Ashwani Lohani
3) K.K.Venugopa 4) Achal Kumar Jyoti
5) Rajiv Kumar

21. Which of the following is the Super Regulatory Body and the idea to create was first mooted by the Raghuram Rajan Committee on Financial Sector Reforms in 2008?
1) Reserve Bank of India (RBI)
2) Securities and Exchange Board of India (SEBI)
3) Insurance Regulatory and Development Authority of India (IRDAI)
4) Pension Fund Regulatory and Development Authority (PFRDA)
5) Financial Stability and Development Council (FSDC)

22. Who occupies top place in the Forbes' list of highest paid female athletes of 2017, with $27 million in earnings between June 2016 and June 2017?
1) Serena Williams 2) Maria Sharapova
3) Venus Williams 4) Martina Hingis
5) Garbine Muguruza

23. World's largest Gold consuming country?
